




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ








| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 178 | ది.16-10-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 178 | Date : 16-10-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


# ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు

## విజయవాడలో సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

- మహిళా శక్తికి వేదికగా సరస్ మేళా-2026
- మహిళా సాధికారతే వికసిత్ భారత్‌కు పునాది
- గ్రామీణ మహిళల ఉత్పత్తులకు 'స్వయం ఏపీ' బ్రాండ్





**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులకు జాతీయ, అంతర్జా తీయ స్థాయిలో గుర్తింపు తీసుకొచ్చేందుకు స్వయం ఏపీ బ్రాండ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తెలిపారు. మహిళలను కేవలం సంక్షేమ పథకాల లబ్ధిదారులుగా కాకుండా సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఏడాది కాలంలో లక్ష మంది స్వయం సహాయక సంఘాల సభ్యులు మహిళా పారిశ్రామి కవేత్తలుగా ఎదిగారని, మరో ఐదు లక్షల మందిని ఆ దిశగా తీర్చిదిద్దుతామని ప్రకటించారు. విజయవాడలో తొలిసారిగా నిర్వహిస్తున్న జాతీయ సరస్ మేళా-2026ను రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ప్రారంభించడంపై ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దసరా శరన్నవరాత్రుల వేళ జాతీయ సరస్ మేళా నిర్వహించడం విజయవాడకు మరింత శోభ తెచ్చిందని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము జీవితం ప్రతి ఆడబిడ్డకు స్ఫూర్తిదాయకమని చెప్పారు. మారుమూల గిరిజన ప్రాంతంలో జన్మించి ఉపాధ్యాయురాలిగా ప్రస్థానం ప్రారంభించిన ఆమె.. ఎన్నో సవాళ్లను అధిగమించి దేశ అత్యున్నత రాజ్యాంగ



పదవిని అధిరోహించారని కొనియాడారు. సంకల్ప బలం, ధైర్యం ఉంటే మహిళలు ఉన్నత శిఖరాలను అధిరోహించగలరని ఆమె నిరూపించారని తెలిపారు. జాతీయ సరస్ మేళాలో 650 స్వయం సహాయక సంఘాలు పాల్గొంటున్నాయని సీఎం తెలిపారు. ఇది కేవలం 14 రోజులపాటు జరిగే ప్రదర్శన కాదని, గ్రామీణ మహిళల ఉత్పత్తులకు ఏడాది పొడవునా మార్కెట్ అవకాశాలు కల్పించే దిశగా అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. మహిళల ఆదాయాన్ని పెంచడం, మహిళా పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడం, గ్రామీణ ఉత్పత్తులకు జాతీయ స్థాయిలో గుర్తింపు తీసుకురావడం మేళా ప్రధాన ఉద్దేశమని వివరించారు. దేశంలోని వివిధ ప్రాంతాల మహిళలు తమ అనుభవాలను పంచుకోవడం తోపాటు విజయగాథలను తెలుసుకోవాలని, కొత్త వ్యాపార అవకాశాలను అన్వేషించాలని సూచించారు.

**రూ.69 వేల కోట్ల టర్నోవర్‌తో డ్వాక్రా సంఘాలు..**

ఆంధ్రప్రదేశ్‌లో 11 లక్షల స్వయం సహాయక సంఘాలు, 1.10 కోట్ల మంది సభ్యులు ఉన్నారని చంద్రబాబు తెలిపారు. ఈ సంఘాల ద్వారా రూ.69 వేల కోట్ల టర్నోవర్ నమోదవుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలో స్వయం సహాయక సంఘాల ఉత్పత్తులు 3.5 కోట్ల మందికి చేరుతున్నాయని వివరించారు. గతంలో వెలుగు కార్యక్రమం ద్వారా మహిళలు సంపద సృష్టించే దిశగా అడుగులు వేశారని గుర్తుచేశారు. నిన్నటి వరకు పొదుపు సంఘాలుగా ఉన్న ఎస్ హెచ్ జీలు నేడు వ్యాపార సంస్థలుగా

- 8లో

# బొద్దింకలు మాకు థాంక్స్ చెప్పాయి.. అందరూ విన్నారా?




**తాడేపల్లి, అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** ఢిల్లీలో సీజేపీ ఆందోళనలకు సోషల్ మీడియా ద్వారా వైసీపీ అధినేత జగన్మోహన్ రెడ్డి సంఘీభావం ప్రకటించారు. అందుకు సీజేపీ నేతలు సౌరవ్ దాస్, అశుతోష్ రాంకాల ధన్యవాదాలు తెలిపారు. సంఘీభావం తెలుపడం, ఈ 'థాంక్స్ గివింగ్' వార్తని వైసీపీ సొంత మీడియా చెప్పుకోవడం మామూలు వార్తగా అనిపించవచ్చు. కానీ ఎన్నడూ కేంద్రానికి వ్యతిరేకంగా ఒక్క ముక్క మాట్లాడని జగన్, ఇంత బహిరంగంగా కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సీజేపీకి సంఘీభావం తెలుపడం మాత్రం మామూలు విషయం కాదు. బిజేపీ-టీడీపిలను 2019 ఎన్నికల నాటికి విజయసాయిరెడ్డి చేత విడగొట్టించారే తప్ప, బిజేపితో పొత్తు పెట్టుకోవాలని అనుకోలేదు. కానీ మోడీ ప్రభుత్వానికి అవసరమైనప్పుడల్లా పార్లమెంటులో బయటా వైసీపీ మద్దతు ఇస్తూనే ఉంది. ఆ తర్వాత 2024 ఎన్నికలలో జగన్ బద్ధ శత్రువైన టీడీపితో బీజేపీ పొత్తులు పెట్టుకుంది. రాష్ట్రంలో ఆయన పదవి, అధికారం కోల్పోవడానికి బిజేపి కారణమైంది.కానీ అప్పుడు కూడా జగన్ ఈవీఎంలను, చంద్రబాబు నాయుడుని నిందించారే తప్ప ప్రధాని మోడీని పల్లెత్తు మాట అనలేదు. ఎందుకు? అంటే కారణాలు అందరికీ తెలుసు.మరిప్పుడు కేంద్రానికి వ్యతిరేకంగా పోరాడుతున్న సీజేపీకి సంఘీభావం తెలిపారు.. ఎందుకు? సీజేపీ తనకు థాంక్స్ చెప్పిందన్న విషయాన్ని కూడా సొంత పత్రికలో అచ్చేయించుకున్నారు.. ఎందుకు? అంటే దీనికీ కారణాలు కనిపిస్తూనే ఉన్నాయి. ఇంతకాలం ఏమి జరగకూడదని ఆయన కోరుకున్నారో సరిగ్గా ఇప్పుడు అదే జరుగుతోంది. జగన్, వైసీపీ రాజకీయ భవిష్యత్‌ను దెబ్బతీయగల 'రెండు పెద్ద కేసుల' విచారణ వేగవంతం అయ్యింది.కనుక ఇంకా వేగవంతమైతే తాను కాంగ్రెస్ స్నేహహస్తం అందుకొని, ఇండియా కూటమిలో చేరడానికి వెనుకాడనని ఈవిధంగా ప్రధాని మోడీకి జగన్ సంకేతాలు పంపుతున్నట్లు భావించవచ్చు. ప్రధాని మోడీ ఇక ముందు కూడా చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్‌లతో కలిసి పయనించాలనుకుంటే పయనించవచ్చు. కానీ ఈ రెండు కేసుల జోలికి వెళ్ళవద్దని సీబీఐ, ఈడీలకు ఓ ముక్క చెప్తే చాలు.. వైసీపీలోకి బొద్దింకలు చేరకుండా ఆపుతారు. లేకుంటే మోడీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బొద్దింకలు చేస్తున్న తిరుగుబాటులో మరో నీలి బొద్దింక కూడా చేరుతుంది. అంతే! జగన్ చెప్పాల్సింది చెప్పేసినట్లే. కనుక ఇప్పుడు బంతి మోడీ కోర్టులో ఉన్నట్లే లెక్క!

# భారత రాష్ట్రపతికి ఘన వీడ్కోలు

- పలికిన రాష్ట్ర గవర్నరు ఎస్ అబ్దుల్ నజీర్, ఇతర ప్రముఖులు..



**గన్నవరం,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గురువారం మధ్యాహ్నం 2.45 గంటలకు విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రత్యేక విమానంలో న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్‌తో పాటు పలువురు ప్రముఖులు రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు. రాష్ట్రపతి రెండు రోజుల పాటు ఎన్టీఆర్ జిల్లా విజయవాడలో పర్యటించి పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పర్యటన ముగించుకుని న్యూఢిల్లీకి తిరుగు ప్రయాణమైన రాష్ట్రపతికి విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంలో రాష్ట్ర గవర్నర్ తో పాటు కేంద్ర వ్యవసాయ, రైతుల సంక్షేమం, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్, కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి కమలేష్ పాశ్వాన్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ మంత్రి వంగలపూడి అనిత, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జి. సాయి ప్రసాద్, రాష్ట్ర డిజిపి హరీష్ కుమార్ గుప్తా, 4(ఎ), గర్ల్స్ ఎన్సిసి బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ప్రవీణ్ యాదవ్, కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజి, జిల్లా ఎస్పీ వి. విద్యా సాగర్ నాయుడు భారత రాష్ట్రపతికి ఘనంగా వీడ్కోలు పలికారు.

## రాష్ట్రపతి ద్రౌపది ముర్ముతో మర్యాదపూర్వకంగా భేటీ అయిన మంత్రి లోకేష్



**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** ఇంద్రకీలాద్రిపై జరుగుతున్న దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు, సరస్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొనేందుకు విజయవాడ వచ్చిన రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారితో రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ మర్యాదపూ-ర్వకంగా భేటీ అయ్యారు. ఈ ఉదయం విజయవాడ నోవాటెల్ హోటల్ కు వెళ్లిన మంత్రి లోకేష్.. రాష్ట్రపతి ద్రౌపది ముర్ము గారితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ద్రౌపది ముర్ము గారిని శాలువాతో ఘనంగా సత్కరించి మంగళగిరి చేనేత చీర, ఏటికొప్పాక కళాకృతిని బహూకరించారు.

# తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

## సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

- పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అండగా ఉంటుంది
- సింగిల్ విండో ద్వారా అనుమతులు
- భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం
- పారిశ్రామికవేత్తలకు గార్డియన్‌గా ఉంటా
- రాష్ట్ర ఆర్థికాభివృద్ధిలో భాగస్వాములుగా నిలవాలి
- సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులకు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క భరోసా

**హైదరాబాద్,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** "తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి.. మీ అభివృద్ధికి ప్రభుత్వం అండగా ఉంటుంది. పరిశ్రమల స్థాపనకు సింగిల్ విండో అనుమతులు, భూమి, విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తాం. హైదరాబాద్ పెట్టుబడులకు అత్యంత సురక్షితమైన, అనుకూలమైన గమ్యస్థానం. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పారిశ్రామికవేత్తలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టి రాష్ట్ర ప్రగతిలో భాగస్వాములు కావాలి" అని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు తాను గార్డియన్‌గా వ్యవహరిస్తానని, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి దోహదపడే పారిశ్రామికవేత్తలకు అవసరమైన సహకారం అందించేందుకు కృషి చేస్తానని స్పష్టం చేశారు. హైటెక్స్‌లో నిర్వహించిన సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్ గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఆయన మాట్లాడుతూ, సంపద సృష్టికర్తలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని స్పష్టం చేశారు. పరిశ్రమల స్థాపనకు అవసరమైన అనుమతులను సింగిల్ విండో విధానం ద్వారా అందించడంతో పాటు, పారిశ్రామిక పార్కుల ద్వారా భూమి, అవసరమైన విద్యుత్, నీటి సదుపాయాలు కల్పిస్తామని హామీ ఇచ్చారు. శాంతిభద్రతలు, మౌలిక సదుపాయాలు, నైపుణ్యం కలిగిన మానవ వనరులు, అనుకూలమైన వ్యాపార వాతావరణం హైదరాబాద్‌ను పెట్టుబడులకు అత్యంత అనువైన గమ్యస్థానంగా నిలుపుతున్నాయని పేర్కొన్నారు. తెలంగాణలో పరిశ్రమల స్థాపనకు అనేక అనుకూలతలు ఉన్నాయని ఉప ముఖ్యమంత్రి వివరించారు. దేశంలో భౌగోళికంగా అనువైన ప్రాంతంలో ఉండటం, పారిశ్రామిక అవసరాలకు తగిన భూమి అందుబాటులో ఉండటం, మెరుగైన



- 8లో

మౌలిక సదుపాయాలు, విద్యాసంస్థల ద్వారా అభివృద్ధి చెందిన నైపుణ్యవంతమైన మానవ వనరులు రాష్ట్రానికి ప్రధాన బలాలని అన్నారు. హైదరాబాద్ వాతావరణం, బహుభాషా సంస్కృతి, వివిధ ప్రాంతాల ప్రజలను ఆదరించే సంప్రదాయం కూడా పెట్టుబడిదారులకు అనుకూలంగా ఉంటాయని చెప్పారు. ప్రాచీన కాలం నుంచి హైదరాబాద్ ప్రపంచవ్యాప్తంగా ఉన్న వ్యాపారులను, పెట్టుబడిదారులను ఆకర్షిస్తోందని, మారుతున్న ఆర్థిక పరిస్థితులకు అనుగుణంగా తెలంగాణ ప్రభుత్వం మరిన్ని పెట్టుబడులను తీసుకురావడానికి ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందని వివరించారు.

**మూడు ప్రాంతాలుగా అభివృద్ధి ప్రణాళిక..**

హైదరాబాద్ పరిసర ప్రాంతాల అభివృద్ధికి కోర్ అర్బన్ రీజియన్ (కోర్),

# సీఎం రేవంత్ ఆదేశాల అమలు.. విద్యుత్ శాఖలో ఉన్నతాధికారి సస్పెన్షన్

- యాదాద్రి థర్మల్ ప్లాంట్ చీఫ్ ఇంజినీర్ బి.సురేశ్ సస్పెన్షన్
- విధుల్లో నిర్లక్ష్యమే చర్యలకు కారణమని టీజీ జెన్‌కో ఉత్తర్వులు
- విద్యుదుత్పత్తి పెంపు పనుల్లో పర్యవేక్షణ లోపాలున్నట్లు ఆరోపణ
- విద్యుత్ కోతలపై సీఎం రేవంత్‌రెడ్డి తీవ్ర అసంతృప్తి
- ఉన్నతాధికారులపైనా చర్యలు తప్పవని సీఎం హెచ్చరిక



**హైదరాబాద్,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** తెలంగాణలో విద్యుత్ కోతలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేసిన గంటల వ్యవధిలోనే ప్రభుత్వం చర్యలకు దిగింది. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలతో యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (వైటీపీఎస్) స్టేజ్-1 చీఫ్ ఇంజినీర్ బి. సురేశ్‌ను సస్పెండ్ చేసింది. టీజీ జెన్‌కో సీఎండీ డాక్టర్ ఎస్.హరీశ్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. విద్యుదుత్పత్తి పెంపునకు ప్రాధాన్య పనుల ప్రణాళిక, పర్యవేక్షణ, అమలులో ఆయన తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించారని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు సస్పెన్షన్ కొనసాగనుంది. బుధవారం సాయంత్రం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రంలో విద్యుత్ కోతలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నైనీ, మహానది బొగ్గు బ్లాకుల నుంచి బొగ్గు సరఫరా ఉన్నప్పటికీ యాదాద్రి థర్మల్ పవర్ స్టేషన్‌లో పూర్తి సామర్థ్యంతో విద్యుదుత్పత్తి ఎందుకు జరగడం లేదని అధికారులను ప్రశ్నించారు. విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిత్తల్, టీజీ జెన్‌కో సీఎండీ ఎస్.హరీశ్‌పైనా చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో పంటలు ఎండిపోకుండా వ్యవసాయానికి నిరంతర విద్యుత్ సరఫరా చేయాలని సీఎం ఆదేశించారు. పంట చేతికొచ్చే వరకు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. రానున్న 20 రోజులు పంటలకు కీలకమని, విద్యుత్ కొరత కారణంగా రైతులు నష్టపోయే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రాకూడదని అన్నారు. వ్యవసాయ విద్యుత్ డిమాండ్ అధికంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి సరఫరా పెంచాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో లోటు వర్షపాతం, ఎల్‌నినో ప్రభావం, విద్యుత్, తాగునీటి సరఫరా పరిస్థితులపైనా సీఎం సమీక్ష నిర్వహించారు. విద్యుత్ సరఫరా మెరుగుపర్చాలని పలుమార్లు ఆదేశించినా పరిస్థితిలో మార్పు రాకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. ప్రజలకు ఇబ్బందులు కలిగించే నిర్లక్ష్యాన్ని సహించబోనని, ప్రజలకు తాను జవాబుదారీగా ఉన్నానని స్పష్టం చేశారు.

# విజయవాడ దుర్గమ్మకు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటం విరాళం

- శ్రీకాకుళం జిల్లాకు చెందిన భక్తుడు దుర్గా శ్రీనివాస్ సమర్పణ
- 494 గ్రాముల బంగారంతో నవరత్నాలతో కిరీటం తయారీ
- దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ ఈ కానుక అందజేత



**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** విజయవాడ ఇంద్రకీలాద్రిపై వెలసిన శ్రీ కనకదుర్గ అమ్మవారికి దసరా శరన్నవరాత్రి ఉత్సవాల వేళ భారీ కానుక అందింది. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఓ భక్తుడు సుమారు రూ.75 లక్షల విలువైన స్వర్ణ కిరీటాన్ని అమ్మవారికి విరాళంగా సమర్పిం చారు. వివరాల్లోకి వెళితే.. శ్రీకాకుళం జిల్లాకు చెందిన కుర్మినాయుడు, పద్మావతమ్మ దంపతుల కుమారుడైన కె. దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని విరాళంగా ఇచ్చారు. 494 గ్రాముల స్వచ్ఛమైన బంగారంతో రూపొందించిన ఈ కిరీటంలో ఎరుపు, నీలం, తెలుపు, ఆకుపచ్చ రంగుల నవరత్నాలను పొదిగారు. దసరా ఉత్సవాల సంద ర్భంగా దుర్గా శ్రీనివాస్ ఈ కిరీటాన్ని ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) శీనానాయక్ కు అందజే శారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అమ్మవారి ఆశీస్సులతోనే ఈ కానుకను సమర్పించానని, పవిత్రమైన నవరాత్రుల సమయంలో కిరీటాన్ని అందించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న ప్రత్యేక పూజలు, దర్శనాల నడుమ ఈ విరాళం అందడం విశేషం.

## శ్రీ లలితా త్రిపుర సుందరి అవతారంలో సాక్షాత్కరించిన అమ్మవార్లు



**విస్సన్నపేట,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల మారెమ్మ తల్లి అమ్మవారు విజయదశమి సందర్భంగా శ్రీ లలిత త్రిపుర సుందరి అమ్మవారి అవతార రూపంలో దర్శనం ఇవ్వడం జరిగింది. మండల కేంద్రంలో ద్వారకా నగర్ లో శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీ లలితా త్రిపుర సుందరి మాత రూపంలో నైనానందకరంగా దర్శనం ఇవ్వటంతో భక్తులు విరివిగా పాల్గొని అమ్మవార్లను దర్శించుకొని పూజించి తీర్థ ప్రసాదాలు అందుకున్నారు. పుట్రేల మారెమ్మ తల్లి అమ్మవారు ఆలయంలో ఆలయ చైర్మన్ తెర్ల శ్రీనివాసరావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శ్రీలలితా త్రిపుర సుందరి అమ్మవారికి పూజలు చేసిన పద్మశాలి సామాజిక వర్గ కుటుంబాలు



**విస్సన్నపేట,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో పద్మశాలి వీధిలో శ్రీ లలితా త్రిపుర సుందరి అమ్మవారి అలంకరణలో దర్శనమిచ్చిన శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారికి వైసిపి సీనియర్ యువ నాయకులు లకుశీ పవన్ కుమార్ సారధ్యంలో పద్మశాలి కుల బాంధవులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేద పండితులు నిర్ణయించిన బ్రహ్మ ముహూర్తంలో అమ్మవారికి పెండెం భవన్నారాయణ కుటుంబ సభ్యులు పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు.

## శ్రీ లలితాదేవి రూపంలో కనకదుర్గమ్మ దర్శనం



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలోని షిరిడీ సాయిబాబా ఆలయంలో కొలువై ఉన్న శ్రీ కనకదుర్గమ్మ అమ్మవారు శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా శ్రీ లలితాదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి గోత్రనామాలతో కుంకుమార్చన, అష్టోత్తర పుష్పార్చనలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం ఆలయ అర్చకుడు శ్రీనివాసరావు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కోడెబోయిన బాబి, రావి ఈశ్వర్, రజిని, లంక పద్మశ్రీ, భవాని, అరుణ, కళ్యాణి, ఎస్.కె. మహబూబ్ బీ తదితర భక్తులు పాల్గొన్నారు.

## అతిరథ మహారథులు సమక్షంలో ప్రారంభమైన విజయ ప్లాంట్స్ నర్సరీ



**విస్సన్నపేట,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో మాగంటి ( కృష్ణమోహన్) చిట్టిబాబు గార్డెన్ లో కడియం తరహ విజయ ప్లాంట్స్ నర్సరీ భారీ స్థాయిలో అతిరథ మహారథుల సమక్షంలో ప్రారంభించడం జరిగింది. సంస్థ నిర్వాహకులు మాగంటి ప్రదీప్ చౌదరి, సత్య జయదీప్ లు సంయుక్త సమావేశంలో మాట్లాడుతూ దేశ నలుమూలల నుండి ఫల పుష్ప ఔషధ మొక్కలను అన్ని రకాలను హోల్సేల్ మరియు రిటైల్ గా అందించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆన్లైన్ బుకింగ్ కూడా ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తామే శాస్త్రవేత్తల సహాయ సహకారాలతో వ్యవసాయ రంగాన్ని అభివృద్ధి చేసేందుకు రైతన్నలకు వెన్నుదన్నుగా భూసారాన్ని పరీక్షించి ఫలితాలను తెలియజేస్తూ భూమిని బట్టి అధిక దిగుబడి వచ్చే పంటలను సిఫారస్ చేయడమే కాకుండా సస్యరక్షణలో భాగం పంచుకుంటామని వాటి కొనుగోలు అమ్మకాలకు కూడా రైతన్నలకు భరోసాగా ఉంటామన్నారు. తొలుత జరిగిన పూజా కార్యక్రమంలో పలువురు రాజకీయ నాయకులు రైతులు పాల్గొన్నారు.

## పెడన మండల గ్రామ పంచాయతీ సర్పంచ్ ల రిజర్వేషన్లు ఖరారు..

**పెడన,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** నవంబర్ మాసంలో మూడు దశలు గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ క్రమంలో పెడన మండలంలోని 24 గ్రామ పంచాయితీ సర్పంచ్ అభ్యర్థుల రిజర్వేషన్లను పెడన ఎంపీడీవో కటకం శివప్రసాద్ ప్రకటించారు. రాష్ట్ర ఎన్నికల సంఘ ఆదేశాల మేరకు కృష్ణా జిల్లా కలెక్టర్ ఆనంద్ గ్రామ పంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్ల జాబితాలో విడుదల చేశారు. పెడన మండలంలో గ్రామపంచాయతీ సర్పంచ్ రిజర్వేషన్లు ఈ విధంగా ఉన్నాయి. అచ్చయ్యవారి పాలెం (ఓసి మహిళ) బల్లిపర్రు (ఓసి జనరల్) చెన్నూరు (ఓసి జనరల్) చోడవరం (బీసీ జనరల్) గురువిందగుంట (బీసీ జనరల్)జింజేరు (ఎస్సీ మహిళ)కాకర్లమూడి (ఓసి జనరల్) కమలాపురం (ఓసి మహిళ)కొంగంచర్ల (ఎస్సీ జనరల్)కొంకేపూడి (ఓసి మహిళ)కోప్పల్లి (ఎస్సీ జనరల్) కూడూరు (ఓసి జనరల్) లంకలకలవగుంట (బీసీ జనరల్)మడక (ఓసీ జనరల్)ముచ్చర్ల (ఎస్సీ మహిళ)నడుపూరు (బీసీ జనరల్) నందమూరు (ఓసి మహిళ) నందిగామ (బీసీ మహిళ)నేలకొండపల్లి (ఓసీ జనరల్) పెనుమల్లి (బీసీ మహిళ)పుల్లపాడు (ఓసి మహిళ)శేరిఒత్తర్లపల్లి (బీసీ మహిళ) ఉరివి (ఓసి మహిళ) రిజర్వేషన్లు ఖరారయ్యాయి.

# వెన్నెముక ఆరోగ్యమే చురుకైన జీవనానికి పునాది




**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** సరైన శారీరక కదలికలు లేకపోవడం, గంటల తరబడి కూర్చుని పనిచేయడం, మొబైల్ ఫోన్‌ను తలవంచి ఎక్కువసేపు చూడటం వంటి అలవాట్లు మెడ, నడుము నొప్పులకు కారణమవుతున్నాయని ప్రముఖ ఎండోస్కోపిక్ స్పైన్ సర్జన్ డాక్టర్ యు. భార్గవ రామ్ తెలిపారు. వెన్నెముకను కాపాడుకోవడం అంటే చలనశక్తి, స్వతంత్ర జీవనం, జీవన నాణ్యతను కాపాడుకోవడమేనని పేర్కొన్నారు.అక్టోబర్ 16న ప్రపంచ వెన్నెముక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విజయవాడలోని వాసవ్య నర్సింగ్ హోమ్‌లో డాక్టర్ సమరం అధ్యక్షతన ఆరోగ్య సదస్సు నిర్వహించారు. ఇందులో "వెన్నెముక ఆరోగ్యం" అంశంపై డాక్టర్ భార్గవ రామ్ ప్రసంగించారు. సరైన భంగిమలో కూర్చోకపోవడం, శారీరక శ్రమ తగ్గడం, బరువులను తప్పుగా ఎత్తడం వల్ల వెన్నెముక సమస్యలు రావచ్చని వివరించారు. వయసుతోపాటు డిస్కుల్లో అరుగుదల, గాయాలు, ఇతర ఆరోగ్య సమస్యలూ వెన్నెముకపై ప్రభావం చూపుతాయని చెప్పారు. డిస్కు బయటకు పొడుచుకురావడం లేదా నరాలపై ఒత్తిడి ఏర్పడటం వల్ల నడుమునొప్పి కాళ్లకు వ్యాపించడం, తిమ్మిర్లు, మొద్దుబారడం, కండరాల బలహీనత వంటి లక్షణాలు కనిపించవచ్చన్నారు. స్లిప్ డిస్క్, సయాటికా, స్పైనల్ స్టెనోసిస్, సర్వైకల్ స్పాండిలోసిస్, ఆస్టియోపోరోసిస్ సాధారణంగా కనిపించే వెన్నెముక సమస్యలని పేర్కొన్నారు. వెన్నునొప్పి వస్తే వెంటనే శస్త్రచికిత్స అవసరమనే అపోహ ఉందని, చాలామందికి మందులు, ఫిజియోథెరపీ, తగిన వ్యాయామాలు, జీవనశైలిలో మార్పులతో ఉపశమనం లభిస్తుందని తెలిపారు. అవసరాన్ని బట్టి ఎక్స్‌రే, ఎంఆర్ఐ పరీక్షలతో సమస్యను గుర్తించి చికిత్స నిర్ణయిస్తారని చెప్పారు. మూత్రం లేదా మల విసర్జనపై అకస్మాత్తుగా నియంత్రణ కోల్పోవడం, రెండు కాళ్లలో బలహీనత, జననాంగాల చుట్టూ స్పర్శ తగ్గడం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యసాయం పొందాలని సూచించారు. ఎండోస్కోపిక్ స్పైన్ సర్జరీతో చుట్టుపక్కల కండరాలు, కణజాలాలకు కలిగే నష్టాన్ని తగ్గించి, శస్త్రచికిత్స అనంతరం త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని వివరించారు. అయితే రోగి పరిస్థితి, ఎంఆర్ఐ ఫలితాలు, నరాలపై ఒత్తిడి తీవ్రత, ఇతర ఆరోగ్య సమస్యలను పరిశీలించిన తర్వాతే సరైన చికిత్సా విధానాన్ని ఎంచుకోవాలని స్పష్టం చేశారు. సదస్సులో పాల్గొన్నవారు వెన్నునొప్పిపై అడిగిన ప్రశ్నలకు డాక్టర్ సమాధానమిచ్చారు.

# తిరువూరు మున్సిపల్ చైర్మన్ రేసులో పెనుమల్లి శ్రావణి!

- ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును అవకాశం కల్పించాలని కోరిన డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు
- అవకాశం కల్పిస్తే తిరువూరు అభివృద్ధిలో భాగస్వాములమవుతాం.. ఎమ్మెల్యే సహకారంతో మున్సిపాలిటీని ముందుకు తీసుకెళ్తాం
- నా చిన్నప్పటి నుండి తిరువూరు బాగా అభివృద్ధి అయ్యిటే చూడాలని ఉండేది, తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు వచ్చినా వద్ద నుండి అభివృద్ధి చెందటం మొదలైందన్నారు డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు
- మాకు మున్సిపల్ చైర్మన్ గా అవకాశం కల్పిస్తే తిరువూరుని బాగా అభివృద్ధి చేసి ఈ ప్రాంతం రుణం తీర్చుకుంటామన్నారు-డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు.

**తిరువూరు,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** రానున్న తిరువూరు మున్సిపల్ ఎన్నికల్లో కూటమి తరపున పోటీ చేసేందుకు ఆశావహుల నుంచి దరఖాస్తులు, అభిప్రాయాలను స్వీకరించే ప్రక్రియలో భాగంగా తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తన కార్యాలయంలో అభ్యర్థుల ఇంటర్వ్యూలు నిర్వహించారు. మున్సిపాలిటీలోని 28 వార్డుల్లో పోటీ చేసేందుకు పలువురు ఆశావహులు ఇంటర్వ్యూలకు హాజరై తమకు అవకాశం కల్పించాలని ఎమ్మెల్యేను కోరారు. తమ తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలు, వాటి పరిష్కారానికి అనుసరించాల్సిన కార్యాచరణ, ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించే విధానం, తమకే అవకాశం ఎందుకు కల్పించాలనే అంశాలను ఎమ్మెల్యేకు వివరించారు. ఈ క్రమంలో తిరువూరు మున్సిపల్ చైర్మన్ అభ్యర్థిగా తన సతీమణి పెనుమల్లి శ్రావణికి అవకాశం కల్పించాలని డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావును కోరడం రాజకీయంగా ఆసక్తికరంగా మారింది.

**అభివృద్ధిలో భాగస్వాములమవుతాం !** ఈ సందర్భంగా డాక్టర్ పెనుమల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ.. తన సతీమణి పెనుమల్లి శ్రావణి ఎం.ఫార్మసీ పూర్తి చేశారని తెలిపారు. తిరువూరు మున్సిపాలిటీ అభివృద్ధి పరంగా మరింత ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని, ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు బాధ్యతలు చేపట్టిన తర్వాత నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. తిరువూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో తాము కూడా భాగస్వాములు కావాలన్నదే తమ ఆకాంక్ష అని ఆయన వెల్లడించారు.



తమకు అవకాశం కల్పిస్తే ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు సహకారంతో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేస్తామని తెలిపారు. తమ స్వగ్రామం తిరువూరు మండలంలోని ఎరుకోపాడు అని పేర్కొన్న నాగేశ్వరరావు.. ప్రజలకు సేవ చేసే అవకాశం కల్పిస్తే పట్టణంలోని సమస్యల పరిష్కారానికి, మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యతనిస్తూ తిరువూరును మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తామని స్పష్టం చేశారు. మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఆశావహులు తమ అభ్యర్థిత్వాల కోసం ఎమ్మెల్యేను కలుస్తుండటంతో తిరువూరు రాజకీయాల్లో చైర్మన్ పదవితో పాటు వార్డు అభ్యర్థుల ఎంపికపై ఆసక్తి నెలకొంది. అయితే పెనుమల్లి శ్రావణికి చైర్మన్ అభ్యర్థిగా అవకాశం దక్కుతుందా లేదా అన్నది పార్టీ నిర్ణయంపై ఆధారపడి ఉంది.

# కేవీపీ రామచంద్రరావును మర్యాదపూర్వకంగా కలిసిన నందిగం రవికుమార్

- అన్నపూర్ణ నిత్యాన్న సేవకు కేవీపీ అభినందనలు



**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, మాజీ రాజ్యసభ సభ్యుడు కె.వి.పి. రామచంద్రరావును వాణి సంస్థల అధినేత నందిగం రవికుమార్ ఈరోజు ఉదయం అంపాపురంలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రవికుమార్ నిర్వహిస్తున్న అన్నపూర్ణ నిత్యాన్న సేవా కార్యక్రమం గురించి కేవీపీ రామచంద్రరావు వివరాలు తెలుసుకుని అభినందించారు. నిస్వార్థంగా అన్నదానం నిర్వహిస్తూ ఎంతోమందికి సేవలందించడం అభినందనీయమని, ఇటువంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మరెందరికో స్ఫూర్తినిస్తాయని కొనియాడారు. సమయాభావం కారణంగా ప్రస్తుతం ఈ కార్యక్రమానికి హాజరుకాలేకపోతున్నానని, మరోసారి అవకాశం చూసుకుని వచ్చి కార్యక్రమంలో పాల్గొంటానని ఆయన తెలిపారు. ఆప్యాయతకు, విధేయతకు మారుపేరుగా నిలిచిన కేవీపీ రామచంద్రరావు ఆదర్శాలు, సిద్ధాంతాల పట్ల చూపిన నిబద్ధత, విలువలు, నిజాయితీ నేటి తరానికి ఆదర్శప్రాయమని ఈ సందర్భంగా పలువురు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నందమూరి మురళీకృష్ణ ప్రసాద్, నందిగం రాజశేఖర్ తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

# మానవతా కార్యాలయంలో అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** ఏలూరు రోడ్డులోని మానవతా సంస్థ కార్యాలయంలో భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి, దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. యువతకు, విద్యార్థులకు ఆయన అందించిన స్ఫూర్తిదాయక సందేశాలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో భాగంగా డాక్టర్ అబ్దుల్ కలాం చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న మానవతా సంస్థ చైర్మన్ కోటేశ్వరరావును సభ్యులు అభినందించారు. ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ.. అటువంటి మహనీయుడి చేతుల మీదుగా జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకోవడం తన జీవితంలో మరచిపోలేని అనుభూతి అని, ఆ గౌరవం తన జీవితాన్ని ధన్యం చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మానవతా సంస్థ అధ్యక్షురాలు ఇందిరాదేవి, కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షుడు లక్ష్మణరావు, కోశాధికారి వెంకటస్వామి, డైరెక్టర్లు




సుబ్బారావు, సూర్యనారాయణ, సుబ్బాచారి, చలం, కొండలరావు, కార్యవర్గ సభ్యులు శ్రీధర్, ప్రభాకరరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా కార్యదర్శి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల వేళా ఏలూరు జనసేన పార్టీలోకి చేరికల హేళా..

- 26 వ డివిజన్ గొల్లాయిగూడెం ప్రాంతం నుండి ఇతర పార్టీలకు చెందిన 20మంది నాయకులు, కార్యకర్తలు చేరికలు..
- జనసేన కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించినా ఆర్టీసీ జోన్ 2 చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు ..



**ఏలూరు, అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** ఏలూరు నియోజకవర్గంలోని స్థానిక 16వ డివిజన్ గొల్లాయిగూడెం ప్రాంతాల నుండి ఇతర పార్టీలకు చెందిన సుమారు 20మంది నాయకులు గురువారం జనసేన పార్టీలోకి చేరారు. వీరికి జనసేన ఇంచార్జి రెడ్డి అప్పలనాయుడు పార్టీ కండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. జనసేన పార్టీ సిద్ధాంతాలు, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలు, ఏలూరులో రెడ్డి అప్పలనాయుడు చేస్తున్న కార్యక్రమాలకు ఆకర్షితులై నాయకులు జనసేనలో చేరడం పట్ల పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేశాయి. ప్రజా సమస్యల పరిష్కారానికి, పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ సమష్టిగా కృషి చేయాలని ఈ సందర్భంగా రెడ్డి అప్పలనాయుడు పిలుపునిచ్చారు. జనసేన పార్టీలో చేరిన నాయకులు ప్రతి ఒక్కరికి శుభాకాంక్షలు తెలియజేశారు.. జాయిన్ అయినా వారిలో సిరిపోగు రాజశేఖర్, సీలు వినోద్ కుమార్, సీలు నవీన్ కుమార్, నల్లమట్ల దుర్గారావు, నల్లమట్ల వీర్రాజు, గొల్లమందల అభిలాష్, కింతాటి సూర్య, నల్లమట్ల మరియమ్మ, చిన్నం అఖిల్, కింతాటి సురేష్, తేనేటి రాజు, నల్లగట్ల ఆనంద్, కైతపల్లి హేమంత్, ఇనపనూరి కుమార్, కింతాటి పవన్ కళ్యాణ్ తదితరులు ఉన్నారు.. భవిష్యత్తులో ప్రజాసేవలో చురుకైన పాత్ర పోషించాలని ఆయన ఆకాంక్షించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి విజయానికి కలిసికట్టుగా పనిచేయాలని ఆయన సూచించారు.. ఈ కార్యక్రమం లో నగర అధ్యక్షులు వీరంకి పండు, రాష్ట్ర చేనేత కార్యదర్శి దోనేపూడి లోవరాజు, జిల్లా కార్యదర్శి కస్తూరి సాయి తేజస్విని, సంయుక్త కార్యదర్శి ఓబిలిశెట్టి శ్రావణ్ కుమార్ గుప్తా, నాయకులు రెడ్డి గౌరీ శంకర్, సరిది రాజేష్, బోండా రాము నాయుడు, వల్లూరి వంశీ, వాసా సాయి కుమార్, బెజవాడ నాగభూషణం కుమార్, మెడికల్ నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు..

## రాణా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో కలాంకు నివాళి




**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** భారత మాజీ రాష్ట్రపతి, 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా', 'పీపుల్స్ ప్రెసిడెంట్' డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా కృష్ణాజిల్లా బాపులపాడు మండలం కానుమోలు గ్రామంలో రాణా వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు సుంకర సాంబశివ రాయల్ ఆధ్వర్యంలో ఆయనకు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుంకర సాంబశివ రాయల్ మాట్లాడుతూ.. అపారమైన దేశభక్తి, అసాధారణ ప్రతిభ, నిరాడంబరతకు ప్రతీకగా డాక్టర్ అబ్దుల్ కలాం నిలిచారని పేర్కొన్నారు. తన అద్భుత ఆలోచనలు, స్ఫూర్తిదాయక ప్రసంగాలతో కోట్లాది మంది యువతలో ఆత్మవిశ్వాసాన్ని నింపి, దేశ భవిష్యత్తుకు దిశానిర్దేశం చేసిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థులు, యువత పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం కృషి చేయాలని కలాం ఇచ్చిన సందేశం నేటికీ ఎంతో ప్రాసంగికమని అన్నారు. దేశాభివృద్ధి కోసం ఆయన కన్న కలలు, ఆశయాలు భావితరాలకు నిత్య స్ఫూర్తిగా నిలుస్తాయని పేర్కొంటూ, ఆయన సేవలను స్మరించుకున్నారు.

## పరామర్శించిన తిరువూరు వైసిపి ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్ దంపతులు



**విస్సన్నపేట,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని పుట్రేల గ్రామానికి చెందిన ప్రముఖ కాంట్రాక్టర్ భీమిరెడ్డి పట్టాభి రెడ్డి సతీమణి నీలావతి శివ ఐక్యం చెందటంతో ఆమె పార్థివదేహాన్ని తిరువూరు నియోజకవర్గ ఇన్చార్జ్ నల్లగట్ల స్వామి దాస్ ( సతీమణి ఉమ్మడి మాజీ కృష్ణ జడ్పీ చైర్ పర్సన్ సుధారాణి) దంపతులు, రాష్ట్ర వైసీపీ కార్యవర్గ సభ్యులు మద్దిరెడ్డి సూర్యనారాయణ రెడ్డి మాజీ జెడ్పిటిసి సభ్యులు భీమిరెడ్డి లోకేశ్వర రెడ్డి, దామోదర రెడ్డి తదితరులు పూలదండలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## మాజీ ఎంపీపీ వలవల సత్యనారాయణ ఆకస్మిక మృతి.... విషాదంలో కృత్తివెన్ను మండలం



**కృత్తివెన్ను,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** మండలంలోని కోమాళ్ళపూడి పంచాయతీ మాజీ సర్పంచ్ మాజీ ఎంపీపీ, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు వలవల సత్యనారాయణ అనారోగ్య కారణాలతో గురువారం సాయంత్రం మృతి చెందటంతో కోమాళ్ళపూడి గ్రామం, కృత్తివెన్ను మండలంలో విషాదం నెలకొంది. సౌమ్యుడు, అందరిని ఆప్యాయంగా పలకరించే వ్యక్తి, వలవల ఫౌండేషన్ ద్వారా అనేక సేవ కార్యక్రమాల్లో ముందుండే వలవల సత్యనారాయణ ఈ లోకాన్ని విడిచి వెళ్లడం తెలుగుదేశం పార్టీకి తీరని లోటు అని తెలుగుదేశం పార్టీ నాయకులు అంటున్నారు. వలవల సత్యనారాయణ కుటుంబానికి తమ ప్రగాఢ సంతాపం ప్రకటిస్తున్నట్టు వారు తెలిపారు. వలవల సత్యనారాయణ ఆకస్మిక మృతిపై శాసన సభ్యులు కాగిత కృష్ణా ప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షులు నాగిడి చెన్నకేశవులు, మాజీ డిప్యూటీ స్పీకర్ బూరగడ్డ వేదవ్యాస్, మహా కూటమి నాయకులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తమ అధికారిక కార్యక్రమాలు క్యాన్సల్ చేసుకుని వలవల సత్యనారాయణ పార్ధివ దేహంను దర్శించి, ఘనంగా నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పడానికి రానున్నట్టు తెలుస్తుంది.....

## శ్రీ లలితా దేవిగా దర్శనమిచ్చిన కొండలమ్మ...

**గుడ్లవల్లేరు,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** దసరా నవరాత్రుల్లో భాగంగా వేమవరం శ్రీ కొండలమ్మ తల్లి శ్రీ లలితా దేవిగా గురువారం భక్తులకు దర్శనమిచ్చారు. అధికసంఖ్యలో భక్తులు అమ్మవార్లను దర్శించుకుని పండ్లు, టెంకాయలను సమర్పించి మొక్కుబడులను తీర్చుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.



## ట్రెండ్ సెట్ చేసేందుకు సిద్ధమవుతున్న కూటమి పార్టీల పెద్దలు




**విస్సన్నపేట,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** స్థానిక మండలంలోని తాతకుంట్ల గ్రామంలో డాక్టర్ ఎన్ టి వెంకటేశ్వరరావు కృష్ణ క్లే ప్రొడక్ట్స్ అనుబంధ సంస్థ కృష్ణ ఇంటర్ లాక్ బ్రిక్స్ తయారీ ప్రాంగణంలో టిడిపి గెలుపే లక్ష్యంగా అర్ధరాత్రి వరకు గ్రామస్థాయి సమావేశం జరిగినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతుంది. ఒకవైపు ఎంపీటీసీ అభ్యర్థి మరోవైపు గ్రామ సర్పంచ్ రిజర్వేషన్ వచ్చే క్రమంలో సరికొత్త ట్రెండు సెట్ చేసేందుకు గెలుపు గుర్రాలు ఎన్నిక ఎవరికి అవకాశం ఇవ్వాలి అనే విషయాలపై సమగ్రంగా చర్చించినట్టు తెలుస్తోంది.

## ఇందిరమ్మ ఇల్లు మంజూరైన ఇంటి పత్రాలను లబ్ధిదారులకు అందజేసిన...

### మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజ్.



**దమ్మాయిగూడ, అక్టోబర్ 15(వార్తా ప్రభ)**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టినటువంటి పథకంలో భాగంగా ఇంద్రమ్మ ఇండ్లు క్యూర్ టవర్స్ లో గురువారం నాడు కీసర సర్కిల్ నాలుగవ డివిజన్ దమ్మాయిగూడ రాజీవ్ గృహకల్ప కాలనీలో దాదాపు 15 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు కావడం జరిగింది. ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు ఇల్లు మంజూరైన పత్రాలను పంపిణీ చేసిన మేడ్చల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ మరియు బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఈగ శ్వేతా రాజు ముదిరాజ్, మంజూరు లబ్ధిదారులు అంగోదు సునీత, సిహెచ్ లక్ష్మి , సేదం అఖిల, బి స్నేహ, సామల మహాలక్ష్మి, సిద్ధ, మమత, తదితరులు, ఈ సందర్భంగా లబ్ధిదారులు మాట్లాడుతూ మేడ్చల్ల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బి బ్లాక్ మహిళా అధ్యక్షురాలు ఈగ శ్వేత రాజు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన పత్రాలను స్వీకరించడం చాలా సంతోషంగా ఉందని సంతోషం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుతూ వారి చిరకాల కోరిక నెరవేరడంతో ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు రమణాదేవి, సైదా, ఫాతిమా, మధుకర్ రెడ్డి నరేష్, మహేష్, మరియు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## కట్టమైసమ్మ ఆలయంలో నవరాత్రి పూజలు





**మల్కాజిగిరి : అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గౌతమ్ నగర్ 182 డివిజన్ ఇందిరా నెహ్రూ నగర్ లో కట్ట మైసమ్మ ఆలయంలో హోమం, నవరాత్రి పూజ, అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బి బ్లాక్ ప్రెసిడెంట్ వెంకటేష్ యాదవ్, గౌతమ్ నగర్ 182 డివిజన్ అధ్యక్షులు వైనాల ప్రవీణ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పీవీ సత్యనారాయణ, మిర్యాల రామచందర్, బాలరాజు యాదవ్, కన్న మల్ల నాగరాజు, మోహన్ రాజు, సాయి, సత్య నారాయణ, చెన్నయ్య మహిళా నాయకురాలు సుమలత యాదవ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## పారిశుధ్య కార్మికుల శ్రమకు గుర్తింపుగా దుస్తుల పంపిణీ

**దసరా పండుగ సందర్భంగా మున్సిపల్ సిబ్బందికి అండగా నిలిచిన మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా దంపతులు**





**జవహర్ నగర్, అక్టోబర్ 15(వార్తా ప్రభ):**దసరా పండుగను పురస్కరించుకుని కీసర సర్కిల్ జవహర్ నగర్ మున్సిపల్ సిబ్బందికి మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా దంపతులు దుస్తులు పంపిణీ చేశారు. నగరాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో రేయింబవళ్లు కష్టపడే పారిశుధ్య కార్మికులు, మున్సిపల్ సిబ్బంది సేవలు వెలకట్టలేనివని ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా కొనియాడారు. పండుగ సమయంలో వారి కుటుంబాల్లో సంతోషం నింపాలనే ఉద్దేశంతో ఈ చిన్న సహాయం చేస్తున్నామని తెలిపారు. పారిశుధ్య కార్మికులను గౌరవించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, వారి సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని దంపతులు హామీ ఇచ్చారు. కొత్త దుస్తులు అందుకున్న మున్సిపల్ సిబ్బంది ఆనందం వ్యక్తం చేస్తూ దంపతులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ కార్పొరేటర్ రాజ్ కుమార్, వెంకటేశ్వర్లు, బుజ్జి, శంకర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వైద్యుడిపై కేసు నమోదు.. అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలింపు

**మహిళ ఫిర్యాదుతో చర్యలు తీసుకున్న చుంచుపల్లి పోలీసులు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చుంచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మహిళను వైద్యం పేరుతో వేధించినట్లు వచ్చిన ఫిర్యాదు మేరకు డాక్టర్ నాడికూడి శైలేష్ కుమార్ (39)పై పోలీసులు కేసు నమోదు చేసి అరెస్ట్ చేశారు. కొత్తగూడెం విద్యానగర్ కాలనీలోని శ్రీకృష్ణ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో వైద్యుడిగా పనిచేస్తున్న శైలేష్ కుమార్‌పై బాధిత మహిళ ఫిర్యాదు చేయడంతో పోలీసులు క్రైమ్ నంబర్ 114/2026గా భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్), ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీల నిరోధక చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ క్రమంలో అక్టోబర్ 15వ తేదీ తెల్లవారుజామున విద్యానగర్ కాలనీలో నిందితుడిని అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు. అనంతరం న్యాయస్థానంలో హాజరుపరచగా, కోర్టు ఆదేశాల మేరకు జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

## అబ్దుల్ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశ అభివృద్ధిలో భాగస్వామ్యం అవుదాం

**- ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ పిలుపు**



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 15 (వార్తాప్రభ):**విద్యార్థులు భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను ఆదర్శంగా తీసుకుని, నాణ్యమైన విద్యను అభ్యసిస్తూ దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిపోయిన రామస్వామి యాదవ్ సూచించారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని గోపన్‌పల్లిలో ఉన్న శిశు మంగళ్ అనాథాశ్రమంలో గురువారం జాతీయ విద్యార్థి దినోత్సవాన్ని అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులకు పండ్లు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రామస్వామి యాదవ్ మాట్లాడుతూ.. భారతదేశ 11వ రాష్ట్రపతిగా, గొప్ప శాస్త్రవేత్తగా కలాం దేశానికి విశేష సేవలందించారని పేర్కొన్నారు. అంతరిక్ష, రక్షణ రంగాల అభివృద్ధితో పాటు అణు పరీక్షల్లో కీలక పాత్ర పోషించారని, క్షిపణి సాంకేతికత అభివృద్ధికి చేసిన కృషితో 'మిసైల్ మ్యాన్'గా పేరు పొందారని తెలిపారు. విజన్--2020 ద్వారా అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణానికి దిశానిర్దేశం చేశారని గుర్తుచేశారు. విద్యార్థులు క్రమశిక్షణ,ఏకాగ్రత, పట్టుదలతో లక్ష్యాలను సాధించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ పుస్తక పఠనం, వ్యాయామం, యోగా, ధ్యానానికి ప్రాధాన్యమివ్వాలని చెప్పారు. నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుంటూ భాషా నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, కలాం ఆశయాల సాధనకు కృషి చేయడమే ఆయనకు అందించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు.

## గ్రామీణ వైద్యుల సమస్యల పరిష్కారానికి సంఘం బలోపేతానికి కృషి చేయాలి.

● ఆర్ఎంపీపీ ఎంపీ వెల్ఫేర్ అసోసియేషన్ నియోజకవర్గ అధ్యక్షులు మల్లేష్. రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచారి. ● ఆర్.ఎం.పి. పి.ఎం.పి తొర్రూరు మండల నూతన కమిటీ ఎన్నిక





**తొర్రూరు అక్టోబర్ 15 (వార్తాప్రభ):** గ్రామీణ వైద్యులందరూ సంఘటితంగా ఉండి సమస్యల పరిష్కారానికి సంఘం బలోపేతానికి కృషి చేయాలని ఆర్ఎంపీ పి.ఎం.పి వెల్ఫేర్ అసోసియేషన్ పాలకుర్తి నియోజకవర్గం అధ్యక్షులు మల్లేష్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచారి లు అన్నారు. గురువారం పట్టణ కేంద్రంలో తొర్రూరు మండల గ్రామీణ వైద్యుల కమిటీని నియోజకవర్గ వర్కింగ్ ప్రెసిడెంట్ సింగారపు భీమయ్య, నియోజకవర్గ ఉపాధ్యక్షులు గడ్డం రాజమౌళి ల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేసి నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. తొర్రూరు మండల అధ్యక్షుడిగా గద్దల వెంకటేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ గా మన్యం వెంకన్న, ప్రధాన కార్యదర్శి గా కొమ్మనబోయిన యాకయ్య, కోశాధికారి మంగళపల్లి ప్రకాష్, ఉపాధ్యక్షులుగా సహాయ కార్యదర్శులుగా కార్యవర్గ సభ్యులుగా నియోజకవర్గ అధ్యక్షులు మల్లేష్, రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటాచారి జిల్లా కార్యదర్శి అన్నపురపు వెంకన్న లు ప్రకటించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘటితంగా ఉంటూ సమస్యలను పరిష్కరించుకుంటూ సంఘం బలోపేతానికి కృషి చేస్తామని నూతన కమిటీ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సమావేశంలో గ్రామీణ వైద్యులు జిలకర నాగన్న, నిమ్మల శీను, మదనాచారి, అబ్దుల్లా, పల్లె రవి, రాము గౌడ్, దామోదర్, వినమాల రవి, గుండాల వేణు, యాకన్న, సందీప్, ఐలయ్య, సిద్ధూ, నితీష్, రాజేష్, మరో 20 మంది గ్రామీణ వైద్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఏకలవ్య నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి రూ.1.43 కోట్ల నిధులు విడుదల చేయాలి

**జీహెచ్ఎంసీ కమిషనర్‌కు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి వినతి**



**హైదరాబాద్ : అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మల్కాజ్‌గిరి నియోజకవర్గంలోని గౌతమ్ నగర్ డివిజన్ పరిధిలో ఉన్న ఏకలవ్య నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అభివృద్ధి కోసం 15వ ఆర్థిక సంఘం ద్వారా మంజూరైన రూ.1.43 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయాలని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే శ్రీ మర్రి రాజశేఖర్ రెడ్డి గారు కోరారు. ఈ మేరకు గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ ని మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఏకలవ్య నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ అభివృద్ధికి అవసరమైన నిధులను విడుదల చేయడం ద్వారా స్థానిక ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని తెలిపారు. నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను వేగవంతం చేయడంతో పాటు, ఇప్పటికే ఆమోదం పొందిన పనులకు సంబంధించిన నిధులను తక్షణమే విడుదల చేసి పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. కమిషనర్ సానుకూలంగా స్పందిస్తూ నిధులు విడుదల చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ అభివృద్ధి పనుల పురోగతికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ చింతల శాంతి శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు మేకల రాము యాదవ్, చిన్న యాదవ్, నంద ప్రసాద్, సంబంధిత కాలనీల ప్రతినిధులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## బండారి లేఔట్‌లో డా. ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ



**నిజాంపేట్, అక్టోబర్ 15, (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, బండారి లేఔట్ డివిజన్ పరిధిలోని రాజీవ్ గృహకల్ప వద్ద దేశ మాజీ రాష్ట్రపతి, భారతరత్న, 'మిస్సైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా' డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కొలన్ హన్మంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి డా. ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన దేశానికి అందించిన అమూల్యమైన సేవలను స్మరించుకుంటూ ఘనంగా నివాళులర్పించారు. కలాం గారి సాదాసీదా జీవితం, ఉన్నత ఆలోచనలు, దేశం పట్ల ఆయన అంకితభావం నేటి యువతరానికి ఎల్లప్పుడూ ఆదర్శప్రాయమని పేర్కొన్నారు. ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్ రెడ్డి, బండారి లేఔట్ డివిజన్ అధ్యక్షులు వాసు వరగాని, ప్రగతి నగర్ డివిజన్ అధ్యక్షులు బొమ్ము వెంకటేశ్వర రెడ్డి (తాతిరెడ్డి), మాజీ కార్పొరేటర్ చిట్ల దివాకర్, కే. అమృతయ్య, కమిటీ నిర్వాహకులు మొయినుద్దీన్, రఫత్, రామచంద్ర నాయక్, సరిత లక్ష్మణ్, ప్రభాకర్ రెడ్డి, అబ్దుల్లా, నయాబ్, బాలరాజు, ప్రసాద్ గౌడ్, వెంకటేశ్వర్ గౌడ్, శ్యామ్ గౌడ్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు. వీరితో పాటు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రిమ్స్ పారిశుద్ధ్యం పై కలెక్టర్ ఆగ్రహం

**అదిలాబాద్ అక్టోబర్ 15 (వార్తాప్రభ)**రిమ్స్ ఆస్పత్రి,క్రిటికల్ కేర్ ను కలెక్టర్ అకస్మితిగా తనిఖీ చేశారు. పలు వార్డులను పరిశీలించారు. ఈ క్రమంలో ఎస్.ఎన్.సి.యు వార్డ్ పరిసరాల్లో పారిశుద్ధ్యం సరిగ్గా లేకపోవడం పట్ల కాంట్రాక్టర్,అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎక్కడపడితే అక్కడ చెత్త ఉండటం పట్ల అసహనం వ్యక్తం చేశారు. ఇకపై రిమ్స్ రో ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తే వారికి జరుమానా విధిస్తామని హెచ్చరించారు. రిమ్స్ పార్క్ పరిశుభ్రత ప్రతి ఒక్కరూ బాధ్యత అన్నారు. రిమ్స్ ఆసుపత్రిలో చేపడుతున్న వివిధ అభివృద్ధి పనులు,రోడ్లు,భవనాల నిర్మాణాలు,మరమ్మతులు అత్యున్నత నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని కలెక్టర్ రాజర్షిషా స్పష్టం చేశారు. గురువారం రిమ్స్ ఆసుపత్రితో కొనసాగుతున్న అభివృద్ధి పనులను,కొత్తబ్లాక్ నిర్మాణాలను,మరమ్మత్తు పనులను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్ తో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో రిమ్స్ డైరెక్టర్ చాంబర్లో అధికారులతో సమీక్షించి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. టెండర్లలో బిడ్లు తక్కువకు వేసినప్పటికీ పనుల నాణ్యతలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడేది లేదని తేల్చిచెప్పారు. ఎంబీఎస్ గైడ్‌లైన్స్ ప్రకారం కన్సల్టెంట్ ఇంజనీర్లు పర్యవేక్షించి,నిర్దేశిత 13–14 శాతం ప్రాఫిట్ మినహాయించి నాణ్యమైన పనులు జరిగేలా చూడాలని ఆదేశించారు. ఈ తనిఖీలో రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్,వివిధ విభాగాల వైద్యులు,రోడ్లు భవనల శాఖ ఈఈ రమేష్, పంచాయతీ రాజ్,మున్సిపల్,జి.ఎం.ఎస్.సి.డి ల ఇంజనీరింగ్ అధికారులు,కాంట్రాక్టర్లు,ఔట్ సోర్సింగ్ ఏజెన్సీ ప్రతినిధులు,ఇతర అధికారులు,సిబ్బంది,పాల్గొన్నారు.

వార్తా ప్రభ

# హైదరాబాద్

### మానవత దృక్పథంతో డయాలసిస్ బాధితుడికి ఆర్థిక సాయం చేసిన మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా.



**జవహర్ నగర్, అక్టోబర్ 15(వార్తా ప్రభ):**మానవత్వానికి ప్రతీకగా నిలిచారు మాజీ డిప్యూటీ మేయర్ రెడ్డి శెట్టి శ్రీనివాస్ గుప్తా. జవహర్ నగర్ పరిధిలోని చంద్రపురి కాలనీలో నివాసం ఉంటూ డయాలసిస్ తో బాధపడుతున్న సందం సాయికుమార్ కు తన వంతు సహాయంగా రూ.10 వేల ఆర్థిక సాయాన్ని అందజేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న సాయికుమార్ పరిస్థితిని తెలుసుకున్న వెంటనే స్పందించిన శ్రీనివాస్ గుప్తా నేరుగా అతని ఇంటికి వెళ్లి ఆర్థిక సాయం అందించడంతో పాటు ధైర్యం చెప్పారు. వైద్యానికి ఎలాంటి సహాయం కావాలన్నా అండగా ఉంటానని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ గుప్తా మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, సాయికుమార్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కృష్ణ బాబా, శ్రీమన్నారాయణ, మాధవ్, శ్రీనివాస్ గౌడ్, సవిత, మాధవి తదితరులు పాల్గొన్నారు.

## రహదారిపై లారీలు ..ట్రాఫిక్ ఇబ్బందులు!

**వాహనాలను పక్కకు నిలిపేలా చర్యలు తీసుకోవాలి**




**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సుజా తనగర్ మండల ంగరీబ్‌పేట గ్రామంలోనిప్రధాన రహదారిపై లారీలను ఇష్టానుసారంగా నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ముఖ్యంగా ఇసుక లారీలు, ఇటుకల ట్రాక్టర్లు, సిమెంట్ లారీలు రహ దారిపై నిలిచి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు, పాదచారులు, పశువుల రాకపోకలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఇసుక, ఇటుకలు, సిమెంట్ తీసుకువచ్చే వాహనాల రాకపోకలకు సైతం ఆటంకం ఏర్పడుతోంది. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని పోలీసు శాఖ, ట్రాఫిక్ విభాగం అధికారులు స్పందించి, లారీ యజమానులకు తగిన సూచనలు ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ప్రధాన రహదారిపై వాహనాలను నిలిపివేయకుండా, ట్రాఫిక్‌కు అంతరాయం కలగని విధంగా పక్కకు నిలిపేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడకుండా సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి సమస్యను పరిష్కరించాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## నాయకులగూడెంలో శ్రీ చక్ర కాటన్ పరిశ్రమ ప్రారంభం

**పత్తి రైతులకు న్యాయమైన ధరలు.. యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలి**
**ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సుజాతనగర్ కార్పొరేషన్ పరిధిలోని నాయకులగూడెం 21వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ చక్ర కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమను గురువారం ఎమ్మెల్యే కూనంనేని సాంబశి వరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిశ్రమల స్థాపనతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరగడంతోపాటు ప్రాంత ఆర్థికాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. పత్తి రైతుల శ్రమకు తగిన ప్రతిఫలం దక్కేలా పరిశ్రమ యాజమాన్యాలు న్యాయమైన గిట్టుబాటు ధరలు అందించాలని సూచించారు. రైతులు, కార్మికులు, యువతకు ప్రయోజనం చేకూరేలా పరిశ్రమలు సామాజిక బాధ్యతతో పనిచేయాలని కోరారు. సుజాతనగర్ పారిశ్రామిక అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్కే సాబీర్ పాషా, మేయర్ మూడు గణేష్, కార్పొరేటర్ చింతలపూడి శ్రావణి, మార్కెట్ కమిటీ చైర్మన్ లాల్ సింగ్, సీపీఐ మండల కార్యదర్శి కోమరి హనుమంతరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు భూక్య దస్రు, నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# సంపాదకీయం

## తెలుగు రాష్ట్రాల నుంచి ఆ ఇద్దరే గవర్నర్లు !

: బీజేపీ నాయకత్వంలోని కేంద్రంలో ఉన్న ఎన్డీయే ప్రభుత్వం రెండు తెలుగు రాష్ట్రాలకు గవర్నర్ల విషయంలో ఎంతో ప్రాముఖ్యత ఇస్తూ వస్తోంది. అలా చూస్తే తెలంగాణాలో విద్యా సాగర్ రావును మహారాష్ట్ర తమిళనాడు గవర్నర్ గా పనిచేసే చాన్స్ ఇచ్చింది. హిమాచల్ ప్రదేశ్ హర్యానా రాష్ట్రాలకు బండారు దత్తాత్రేయ గవర్నర్ గా పనిచేశారు. అదే విధంగా తెలంగాణకు చెందిన సీనియర్ బీజేపీ నేత ఇంద్రసేనారెడ్డి ప్రస్తుతం త్రిపుర రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఇక ఏపీకి చెందిన సీనియర్ నాయకుడు బీజేపీ దిగ్గజ నేత ఎం వెంకయ్యనాయుడు ఉపరాష్ట్రపతి అయ్యారు. అదే ఏపీ నుంచి విశాఖకు చెందిన కంభంపాటి హరిబాబు మిజోరాం , ఒడిషా రాష్ట్రాలకు గవర్నర్ గా పనిచేశారు. తాజాగా ఆరుగురు కొత్త గవర్నర్ల నియామకం తరువాత ఒడిషాకు హరిబాబు స్థానంలో బ్రజ్ మోహన్ రామ్ నియమితులయ్యారు. దాంతో గత అయిదేళ్ళుగా పనిచేస్తున్న హరిబాబు పదవీ విరమణ చేయాల్సి వచ్చింది. ఇక చూస్తే ఎంతో మంది గవర్నర్లు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి పనిచేస్తూ వచ్చారు. 2014 నుంచి 2026 మధ్యలో మోడీ ప్రభుత్వ హయంలో చూస్తే చాలా మందికి గవర్నర్లుగా అవకాశం దక్కింది. అయితే ప్రస్తుతం ఏపీకి చెందిన కేంద్ర మాజీ మంత్రి పూసపాటి అశోక్ గజపతిరాజు గోవా గవర్నర్ గా ఉన్నారు. అలాగే ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్ గా ఉన్నారు. ఈ ఇద్దరే రాజ్ భవన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. టీడీపీ నుంచి కొందరు నేతలు గవర్నర్లుగా చాన్స్ కోసం చూస్తున్నారు. అలాగే బీజేపీ నుంచి రెండు తెలుగు రాష్ట్రాలలో పలువురి పేర్లు రేసులో ఉన్నాయి. కానీ బీజేపీ మాత్రం ఎవరికీ చాన్స్ అయితే ఇవ్వలేదు. దాంతో గతంతో పోలిస్తే తెలుగు రాష్ట్రాలకు గవర్నర్లు గా అవకాశాలు తగ్గిపోయాయని అంటున్నారు. మారుతున్న రాజకీయ పరిస్థితులు పరిణామాల నేపథ్యంలో రాజ్ భవన్లు అత్యంత కీలకంగా మారుతున్నాయి. అంతే కాదు గవర్నర్ల పాత్ర కూడా అతి ముఖ్యమైనదిగా ఉంటోంది. ఆ మధ్య చూస్తే తమిళనాడులో విజయ్ ప్రభుత్వం ఏర్పాటు విషయంలో గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్ ఎలా వ్యవహరించారో అంతా చూశారు. నంబర్ గేమ్ గా మారిన తమిళ ముఖ్యమంత్రి పీఠం విషయంలో పక్కాగా లెక్కలు అన్నీ చూసుకుని మరీ విజయ్ ని ఆహ్వానించారు. ఈ సమయంలో ఎటువంటి విమర్శలు వచ్చినా కూడా రాజ్ భవన్ నిబంధనలను పాటించింది అని గుర్తు చేస్తున్నారు. అలాగే జాతీయ గీతాల ఆలాపన విషయంలో కూడా గవర్నర్లు ప్రభుత్వానికి సూచనలు చేస్తూ వస్తున్న సందర్భాన్ని చూశారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ లకు గవర్నర్లుగా చేసిన మాజీ బీజేపీ నేతలు గట్టిగా ఉంటూ ప్రభుత్వాలు తీసుకునే నిర్ణయాలను ఒకటికి పది సార్లు పరిశీలిస్తూ వచ్చిన సందర్భాన్ని గుర్తు చేస్తుంటున్నారు. అందువల్ల ఒకప్పుడు గవర్నర్ పదవి అంటే హోదా దర్జా కానీ ఇపుడు క్రియాశీలంగా వ్యవహరిస్తున్నారు. అంతే కాదు ప్రతీ అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారు. దాంతో రాజ్యాంగపరమైన అంశాల మీద అవగాహనతో పాటు నిబద్ధత పట్టు ఉన్న వారిని ఆర్ ఎస్ ఎస్ మూలాలు ఉన్న వారిని ఏరి కోరి బీజేపీ ప్రతిపక్ష పాలిత రాష్ట్రాలలో గవర్నర్లుగా పంపుతోంది అని గుర్తు చేస్తున్నారు.

## దసరా పండుగ సందర్భంగా నిత్యం రెండు ఉచిత గ్యాస్ సిలిండర్లు పంపిణీ

**శ్రీ భవాని గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీ హరిబాబు**



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 15: (వార్త ప్రభ ప్రతినిధి)** దసరా పండుగ సందర్భంగా ప్రతినిత్యం లక్కీ డ్రా తీసి ఇరువురు భారత్ గ్యాస్ వినియోగదారులకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లను అందజేస్తున్నట్లు విద్యాధరపురంలోని శ్రీ భవాని గ్యాస్ కంపెనీ అధినేత గద్దె శ్రీ హరిబాబు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దసరా పండుగను పురస్కరించుకుని భారత్ గ్యాస్ కంపెనీ తమ వంతుగా ప్రతి గ్యాస్ ఏజెన్సీలో క్యాష్ మెమో నంబర్లు ద్వారా ఎలక్ట్రానిక్ లక్కీ డిప్ నిర్వహించి విజేతలైన ఇరువురు వినియోగదారులకు వంట గ్యాస్ సిలిండర్లను ఉచితంగా అందిస్తున్నట్లు వివరించారు. దసరా పండుగ 10 రోజులు పాటు ఈ విధంగా రోజుకు ఇరువురు వినియోగదారులకు వంట గ్యాస్ సిలిండర్లను ఇవ్వడం జరుగుతుందన్నారు. తమ శ్రీభవాని గ్యాస్ ఏజెన్సీ లో వినియోగదారులకు మెరుగైన సేవలను అందజేస్తున్నట్లు శ్రీహరి బాబు తెలిపారు.

## పాత శివాలయంలో లలితా త్రిపురసుందరీదేవిగా అమ్మవారు




**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)** నగరంలోని వన్‌టౌన్ పాత శివాలయం శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం అమ్మవారు శ్రీ లలితా త్రిపురసు ందరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా మల్లేశ్వరస్వామికి మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం, చండీ సప్తశతి, గాయత్రీ, రుద్ర హోమాలు నిర్వహించారు. భ్రమరాంబ అమ్మవారికి పుష్పాలంకరణ, సహస్రనామార్చన, శ్రీచక్ర నవార్చన, సువాసిని పూజ, కుంకుమ పూజ తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం, ధర్మకర్తల మండలి చైర్మన్ ధనేకుల వెంకట సుబ్బారావు, పాలకమండలి సభ్యులు, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

# విజయవాడలో టీడీపీ కార్పొరేటర్ సీట్లకు బేరసారాలా?

- బీసీలకు పెద్దపీట ఎక్కడ? యువతకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?
- సీట్ల కేటాయింపుపై వస్తున్న ఆరోపణలకు టీడీపీ నాయకత్వం సమాధానం చెప్పాలి:కామరాజ్ హరీష్ కుమార్



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 15:(వార్త ప్రభ ప్రతినిధి)** విజయవాడ నగరంలో తెలుగుదేశం పార్టీ కార్పొరేటర్ సీట్ల కేటాయింపుపై బేరసారాలు జరుగుతున్నాయంటూ వినిపిస్తున్న ఆరోపణలపై టీడీపీ నాయకత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పాలని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి కామరాజ్ హరీష్ కుమార్ ఈ రోజు విడుదల చేసిన పత్రికా ప్రకటనలో డిమాండ్ చేశారు. బీసీలకు రాజకీయాల్లో పెద్దపీట వేస్తామని గొప్పగా ప్రకటించిన టీడీపీ, విజయవాడలో కార్పొరేటర్ సీట్ల కేటాయింపు విషయంలో ఆ హామీలను ఎంతవరకు అమలు చేస్తోందో వెల్లడించాలని ఆయన ప్రశ్నించారు. పార్టీ జెండాను మోస్తూ, నాయకుల వెంట నడుస్తూ, ఎన్నో ఏళ్లుగా పార్టీ బలోపేతానికి కష్టపడిన కార్యకర్తలను పక్కనపెట్టి, ఆర్థిక స్థోమత ఉన్నవారికే ప్రాధాన్యం ఇస్తున్నారనే విమర్శలకు టీడీపీ నాయకత్వం సమాధానం చెప్పాలన్నారు. ఒక్కో డివిజన్‌లో పోటీని పెంచి, కార్పొరేటర్ సీట్లకు రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు ధరలు నిర్ణయిస్తున్నారనే ప్రచారంలో వాస్తవమెంత అని ప్రశ్నించారు. ఈ ఆరోపణలు నిరాధారమైతే, సీట్ల కేటాయింపునకు అనుసరిస్తున్న ప్రమాణాలను ప్రజల ముందు ఉంచాలని సూచించారు. బీసీలకు పెద్దపీట వేస్తామని, సామాజిక న్యాయం అందిస్తామని చెప్పిన టీడీపీ, క్షేత్రస్థాయిలో పార్టీ కోసం పనిచేసిన బీసీ నాయకులకు ఎన్ని అవకాశాలు కల్పించిందో స్పష్టం చేయాలని కామరాజ్ హరీష్ కుమార్ డిమాండ్ చేశారు. అదే విధంగా జెన్ జీ యువతకు రాజకీయ అవకాశాలు కల్పిస్తామని హామీలు ఇచ్చి, సీట్ల కేటాయింపు సమయానికి వారిని పక్కనపెడుతున్నారనే విమర్శలపైనా వివరణ ఇవ్వాలన్నారు. రాజకీయాల్లో పదవులు, అవకాశాలు డబ్బు ఆధారంగా కాకుండా ప్రజాసేవ, పార్టీ కోసం చేసిన కృషి, సామాజిక ప్రాతినిధ్యం, ప్రజలతో ఉన్న సంబంధాల ఆధారంగా కల్పించాలన్నదే ప్రజాస్వామ్య స్ఫూర్తి అని పేర్కొన్నారు. విజయవాడలో కార్పొరేటర్ సీట్ల ఎంపికకు అనుసరిస్తున్న ప్రమాణాలేమిటి, రూ.20 లక్షల నుంచి రూ.50 లక్షల వరకు సీట్ల బేరసారాలు జరుగుతున్నాయనే ప్రచారంపై టీడీపీ సమాధానమేమిటి, బీసీలకు మరియు యువతకు ఎన్ని అవకాశాలు కల్పించారు, ఏళ్ల తరబడి పార్టీ కోసం కష్టపడిన కార్యకర్తలకు ఎంత ప్రాధాన్యం ఇచ్చారు అనే అంశాలపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ప్రజాస్వామ్యంలో కార్పొరేటర్ సీటు అమ్మకపు సరుకు కాదు.. ప్రజలకు సేవ చేసే బాధ్యత. విజయవాడ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన బాధ్యత టీడీపీ నాయకత్వంపై ఉందని, సీట్ల కేటాయింపుపై వస్తున్న ఆరోపణలకు పారదర్శకంగా సమాధానం చెప్పాలని కామరాజ్ హరీష్ కుమార్ తన ప్రకటనలో పేర్కొన్నారు.

## ఎన్నికల విధివిధానాలపై రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులకు ఆచరణాత్మక శిక్షణ



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి )**విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో నిర్వహించనున్న 2026 రెండో సాధారణ పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో, ఎన్నికల నిర్వహణకు సంబంధించిన విధివిధానాలపై రిటర్నింగ్ అధికారులు , అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులశ్రీకు గురువారం ఆచరణాత్మక శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశాల మేరకు, ఎన్నికల నోడల్ అధికారి, అదనపు కమిషనర్ ఏ. రవీంద్రరావు, ఎన్నికల శిక్షణ నోడల్ అధికారి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ డి. హరీష్ ఆధ్వర్యంలో గవర్నర్‌పేటలోని ఐవీ ప్యాలెస్‌లో ఈ కార్యక్రమం జరిగింది. కమిషనర్ ధ్యానచంద్ర వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ శిక్షణలో నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఎన్నికలకు సంబంధించిన రికార్డులు, నివేదికల తయారీ, పోలింగ్ ప్రక్రియతో పాటు ఎన్నికల నిర్వహణలో పాటించాల్సిన నిబంధనలు, విధివిధానాలపై అధికారులకు ఆచరణాత్మకంగా అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రక్రియలోని వివిధ దశల్లో అధికారులు నిర్వహించాల్సిన బాధ్యతలను, సంబంధిత మార్గదర్శకాలను వివరించి, ఎన్నికల విధులను సమర్థవంతంగా నిర్వహించేందుకు అవసరమైన శిక్షణ అందించారు. మేయర్ ఎన్నికకు సంబంధించిన రిటర్నింగ్ అధికారి, వార్డు సభ్యుల ఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారులు హ్యాండ్‌బుక్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఎన్నికల నిర్వహణలో సమన్వయం, సమయపాలన, రికార్డుల నిర్వహణకు ప్రాధాన్యతనిస్తూ, ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు అధికారులు ముందస్తు సన్నద్ధతతో ఉండాలని పేర్కొన్నారు.

## శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవీ గా దర్శనమిచ్చిన నగరాల శ్రీ మహాలక్ష్మి అమ్మవారు



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)** చిట్టినగర్ లోని శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానంలో ఘనంగా దసరా శరన్నవరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. చిట్టినగర్ శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీమహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం నందు దసరా శరన్నవరాత్రులు ఉత్సవాల్లో భాగంగా 5వ రోజు అమ్మవారు శ్రీ లలితా త్రిపుర సుందరిదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు. సుమారుగా 3000 మంది భక్తులు అమ్మవారు కుంకుమ పూజ చేసుకొని భక్తి శ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదలు స్వీకరించారు పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే ఆఫీస్ ఇంచార్జ్ పత్తిపాటి శ్రీధర్ కృష్ణాజిల్లా నగరాల సంఘం అధ్యక్షులు బెవర శ్రీనివాస్ ఈది రాజారావు, కమిటీ సభ్యులు అందరు పసుపు కుంకుమ సారెతో దర్శించుకుని అమ్మవారి సేవలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా వచ్చిన ప్రతి భక్తులకి ప్రసాదం



పంపిణీ చేయడం జరిగింది. ప్రతిరోజు సాయంత్రం నృత్య ప్రదర్శన కార్యక్రమం చేయడం జరుగుతుంది వారికి సర్టిఫికెట్స్ గిఫ్ట్ దేవస్థానం నుంచి ఇవ్వడం జరుగుతుంది సాయంత్రం పంచ హారతులు అమ్మవారికి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు పోతిన బేసు కంతేశ్వరుడు సెక్రటరీ తొత్తడి భరత్, కోశాధికారి బెవర సాయి సుధాకర్, కోరగంజి భాస్కరరావు తమ్మిన సూర్యకుమారి పిళ్ళా సరిత రాయన ఆదిబాబు గర్రె భాస్కర్ రావు మరియు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# పటిష్టంగా ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు

**- నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలుకు చర్యలు**
**- జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**



**విజయవాడ, అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**గ్రామీణ, పట్టణ స్థానిక సంస్థల 2వ సాధారణ ఎన్నికల నేపథ్యంలో ఈ నెల 14వ తేదీ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్)ని పటిష్టంగా అమలు చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేరకు ప్రవర్తనా నియమావళిని నిష్పాక్షికంగా, పారదర్శకంగా అమలు చేయడానికి అధికారులకు ఆదేశాలు జారీచేశారు. ప్రభుత్వ అధికారిక వెబ్‌సైట్లలో ఉన్న మంత్రులు, రాజకీయ నాయకులు లేదా రాజకీయ పార్టీల వివరాలన్నింటినీ తొలగించాలి లేదా కప్పి ఉంచాలని.. అదేవిధంగా ప్రభుత్వ నిధులతో ఏర్పాటుచేసిన హోర్డింగ్‌లు, ప్రకటనల్లో రాజకీయ నాయకులు, రాజకీయ పార్టీల ఫొటోలు, పేర్లు, గుర్తులు, సందేశాలను తొలగించాలని సూచించారు. రాజకీయ నాయకుల విగ్రహాలను పూర్తిగా కప్పి ఉంచాలని, ఎన్నికల కోడ్ అమల్లో ఉన్నంతకాలం జారీచేసే విద్యుత్, నీటి బిల్లులపై రాజకీయ ప్రచారానికి సంబంధించిన ఫొటోలు, సందేశాలు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఎంసీసీకి సంబంధించిన అన్ని మార్గదర్శకాలను తు.చ. తప్పకుండా పాటించాలని.. నిబంధనల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ లక్ష్మీశ స్పష్టం చేశారు. ఇందుకు సంబంధించిన ప్రత్యేక బృందాలు అప్రమత్తంగా ఉండాలన్నారు.

## జ్ఞానసాయికి విశేషాభిషేకాలు..



**గుడ్లవల్లేరు: అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని అంగలూరు శ్రీ జ్ఞానసాయి మందిరంలో గురువారం వేకువజామునే ఆ మందిర ప్రధాన నిర్వాహకులు యలమంచిలి నాగమోహన్, లక్ష్మీకుమారి దంపతుల ఆధ్వర్యంలో విశేషాభిషేకాలను నిర్వహించారు. అనంతరం సాయికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో నిర్వాహకులు దుగ్గిరాల ఆంజనేయ ప్రసాద్, నాగవల్లీ, తిపిర్నేని రాజా తదితరులు పాల్గొన్నారు. అలాగే కౌతవరం, కొండిపాలెం శ్రీ షిరిడీ సాయి ఆలయాల్లో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి.

## అబ్దుల్ కలాం జయంతివేడుకలను ఘనంగా నిర్వహించిన 'అబ్దుల్ కలాం వాకర్ అసోసియేషన్'



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)?**అబ్దుల్ కలాం వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భారత మాజీ రాష్ట్రపతి, మిస్సైల్ మ్యాన్ డాక్టర్ ఏ.పి.జె. అబ్దుల్ కలాం గారి జయంతి వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా క్లబ్ సభ్యులందరూ కలిసి అబ్దుల్ కలాం గారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ?ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ... "ఒక సామాన్య కుటుంబంలో జన్మించిన అబ్దుల్ కలాం గారు, దేశ అత్యున్నత పదవి అయిన రాష్ట్రపతి హోదాకు ఎదిగారు. శాస్త్రవేత్తగా తన ప్రస్థానాన్ని మరియు అనుభవాలను వివరిస్తూ ఎంతోమంది విద్యార్థులకు నిరంతరం స్ఫూర్తిని నింపారు. క్రమశిక్షణ, నిరంతర కృషి ఉంటే ఎంతటి ఉన్నత శిఖరాలనైనా అధిరోహించవచ్చని ఆయన నిరూపించారు. అటువంటి మహనీయుడి జయంతి రోజున వారి జ్ఞాపకాలను స్మరించుకుంటూ నివాళులర్పించడం అసోసియేషన్‌కు ఎంతో ఆనందదాయకం" అని తెలిపారు. అలాగే, అబ్దుల్ కలాం గారి ఆశయ సాధన దిశగా వారి పేరు మీద ఈ అసోసియేషన్‌ను స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యంగా ఎంతోమంది పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తూ వారి చదువుకు ఆసరాగా నిలవడంలో అసోసియేషన్ కార్యదర్శి జగ్గుపిల్ల శ్రీనివాసరావు విశేష కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు గుగ్గిలం విజయ్ కుమార్ , కార్యదర్శి జగ్గుపిల్ల శ్రీనివాసరావు తో పాటు సభ్యులు రమేష్, సత్యనారాయణ, బెల్లం వెంకటేశ్వరరావు, రామకృష్ణ, అమర్, చంద్రశేఖర్, మరియు ఇతర అసోసియేషన్ సభ్యులు విశేష సంఖ్యలో పాల్గొన్నారు.

## శ్రీ స్కంద మాతా దేవీ అలంకారం లో దర్శనం ఇచ్చిన శ్రీ దేవీ కరుమారి అమ్మన్





**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)** శ్రీ దసరా శరన్నవరాత్రి మహోత్సవం-2026 లో భాగంగా మిల్క్ ఫ్యాక్టరీ సమేపంలో సీ వీ ఆర్ ఫ్లై ఓవర్ బ్రిడ్జి పక్కన ఉన్న శ్రీ దేవీ కరుమారి అమ్మన్ శక్తి పీఠంలో దసరా వేడుకలు వైభవంగా జరుగుతున్నాయి. గురు వారం ఐదో రోజు శ్రీ దేవి కరుమారి అమ్మ వారుశ్రీ స్కంద మాతా దేవి రూపం లో దర్శనం ఇచ్చారు. అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక హోమం నిర్వహించారు. అమ్మవారి సన్నిధిలో వేలాది మంది భక్తులు ప్రత్యేక పూజలతో పాటుగా సామూహిక కుంకుమార్చన చేశారు. పీఠదిపతి శ్రీశ్రీశ్రీ కరుణానందనాథ స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకల్లో వందలాది మంది భక్తులకు అన్న ప్రసాద వితరణ జరిగింది. అమ్మవారి సన్నిధి లోని కళా వేదికపై చిన్నారులతో నిర్వహించిన సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకొన్నాయి అమ్మవారి ఆలయానికి, భక్తుల కోసం ఏర్పాటు చేసిన విద్యుత్ స్వాగత తోరణాలు భక్తులను ఆకట్టుకొన్నాయి. గురువారం రాత్రి జరిగిన అమ్మవారి ఉత్సవ మూర్తి నగరోత్సవ ఊరేగింపు లో మహిళా భక్తులు వందలాది గా పాల్గొన్నారు.

## చిట్టినగర్, శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో ప్రత్యేక పూజలు.



**విజయవాడ పశ్చిమ అక్టోబర్ 15 :(వార్త ప్రభ ప్రతినిధి)** చిట్టినగర్ లోని శ్రీ నగరాల సీతారామస్వామి శ్రీ మహాలక్ష్మి అమ్మవార్ల ఆలయంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో కోలాహలంగా జరుగుతున్నాయి.. ఉత్సవాలలో 5వ రోజైన గురువారం శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవి రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని పశ్చిమ ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలతో , సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నారు ఆలయ అధ్యక్షుడు పోతిన భేసు కంటేశ్వరుడు,కమిటీ సభ్యులు ప్రత్తిపాటి శ్రీధర్ కు స్వాగతం పలికారు. దేవస్థాన కమిటీ సభ్యులు తొత్తడి భరత్, బెవర సాయి సుధాకర్, చౌక్కార శ్రీనివాసరావు, కత్తెర సురేష్, పొట్నూరు శివ, గుడెల మణికంఠ, రాంపిళ్ళ వాసు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ లలితా త్రిపుర సుందరి దేవిగా దర్శనం ఇచ్చిన శ్రీ కనక దుర్గమ్మ......



**పెనుగంచిప్రోలు - అక్టోబర్ 15( వార్త ప్రభ )** శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి గాభక్తుల కు దర్శనం ఇచ్చిన పడమర బజారు డౌన్ సెంటర్ శ్రీ కనకదుర్గమ్మ అమ్మ వారు, అమ్మ వారి సన్నిధిలో శ్రీ లలిత సహస్ర నామం జపిచుస్తున్న పెనుగంచిప్రోలు జమ్మిచెట్టు శ్రీ కోదండ రామాలయం భక్త బృందం వారు.. ఈ కార్యక్రమంలో మండల స మై ఖ్య అధ్యక్షురా లు కర్ల కోటేశ్వరి,

# వాహ్లే ఇండియాతో సంస్థ తో ఆర్.కె. కాలేజ్ ఒప్పందం

**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 15(వార్తా ప్రభ ప్రతినిధి):**విద్యార్థులకు పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అందించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచాలనే లక్ష్యంతో ఆర్.కె. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ వాహ్లే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ తో అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు పరిశ్రమ ఆధారిత శిక్షణ, నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు, ఇంటర్న్‌షిప్ లు, ఉద్యోగ నియామకాలకు సంబంధించిన అవకాశాలను కల్పించేందుకు రెండు సంస్థలు పరస్పరం సహకరించనున్నాయి. ఈ కార్యక్రమంలో భాగంగా జర్మనీకి చెందిన వాహ్లే గ్రూప్ గ్లోబల్ హ్యూమన్ రిసోర్సెస్ బిజినెస్ పార్ట్‌నర్ పెట్రా వీస్వోర్ట్నర్, వాహ్లే ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ కుమార్ లోగనాథన్ ఆర్.కె. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ క్యాంపస్‌ను సందర్శించారు. ఈ ఒప్పందం ద్వారా విద్యార్థులకు ప్రస్తుత పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానం, వృత్తిపరమైన నైపుణ్యాలు, కమ్యూనికేషన్ సామర్థ్యాలు, బృంద నిర్వహణ, సమస్యల పరిష్కార సామర్థ్యాలను పెంపొందించే దిశగా కార్యక్రమాలు చేపట్టేందుకు అవకాశాలు ఏర్పడనున్నాయి. ఈ సందర్భంగా విద్యార్థులతో నిర్వహించిన ముఖాముఖి కార్యక్రమంలో పరిశ్రమల్లో అందుబాటులో ఉన్న కెరీర్ అవకాశాలు, ఇంటర్న్‌షిప్‌ల ప్రాధాన్యత, ఉద్యోగ నియామక ప్రక్రియలు, పరిశ్రమలు ఆశించే నైపుణ్యాలు, విద్యార్థులు తమ కెరీర్‌ను ఎలా ప్రణాళికాబద్ధంగా నిర్మించుకోవాలి అనే అంశాలపై అతిథులు




తమ అభిప్రాయాలను పంచుకున్నారు. విద్యార్థులు తమ విద్యాభ్యాస దశ నుంచే పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలని, నిరంతర అభ్యాసం, సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం ఉద్యోగ జీవితంలో కీలక పాత్ర పోషిస్తాయని వారు వివరించారు. అనంతరం కళాశాల అధ్యాపకులు, యాజమాన్య ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పరిశ్రమ-- విద్యాసంస్థల మధ్య సమన్వయాన్ని మరింత బలోపేతం చేయడం, విద్యార్థులకు ప్రాయోగిక పరిజ్ఞానాన్ని అందించడం, పరిశ్రమ నిపుణుల ద్వారా శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం, విద్యార్థుల ప్రతిభను ఉద్యోగ అవకాశాలకు అనుసంధానం చేయడం వంటి అంశాలపై చర్చించారు. ఈ భాగస్వామ్యం ద్వారా విద్యార్థులకు విద్యాసంబంధిత పరిజ్ఞానంతో పాటు వాస్తవ పారిశ్రామిక వాతావరణం పై అవగాహన కల్పించేందుకు తెలిపారు. ఈ సందర్భంగా ఆర్.కె. ఎడ్యుకేషనల్ సొసైటీ ట్రెజరర్ ఎం.జి. అమరనాథ్ మాట్లాడుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు, వారిని పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో తీర్చిదిద్ది, మెరుగైన ఉపాధి అవకాశాలకు సిద్ధం చేయడం సంస్థ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రముఖ పరిశ్రమలతో భాగస్వామ్యాలను అభివృద్ధి చేయడం ద్వారా విద్యార్థులకు ప్రస్తుత ఉద్యోగ మార్కెట్ అవసరాలపై అవగాహన, ప్రాయోగిక శిక్షణ, కెరీర్ అభివృద్ధికి అవసరమైన మార్గదర్శకత్వం లభిస్తాయని పేర్కొన్నారు. వాహ్లే ఇండియాతో కుదిరిన ఈ అవగాహన ఒప్పందం విద్యార్థుల భవిష్యత్తుకు మరింత ప్రయోజనకరంగా నిలుస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమం ద్వారా ఆర్.కె. కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ విద్యార్థులకు విద్యా పరిజ్ఞానాన్ని వృత్తిపరమైన నైపుణ్యాలతో అనుసంధానించుకునే అవకాశం లభించనుంది. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దడం, వారి ఉపాధి సామర్థ్యాన్ని పెంపొందించడం, భవిష్యత్తులో మెరుగైన కెరీర్ అవకాశాలను అందిపుచ్చుకునేలా ప్రోత్సహించడం ఈ అవగాహన ఒప్పందం ప్రధాన ఉద్దేశ్యంగా నిలుస్తుందని తెలిపారు.

# ప్రతి ఒక్కరూ పఠనా శక్తిని అలవర్చుకోవాలి

**నిమ్రా విద్యాసంస్థల వైస్ చైర్మన్ షాదిల్ రసూల్ ఖాన్**

**హెల్త్ కేర్ మేనేజ్మెంట్ ఇన్ కార్పొరేట్ హాస్పిటల్ పుస్తకం ఆవిష్కరణ**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 15(వార్తా ప్రభ ప్రతినిధి):**ప్రతి ఒక్కరు పుస్తక పఠన శక్తిని అలవర్చుకోవాలని సూచించారు నిమ్రా విద్యాసంస్థల వైస్ చైర్మన్ షాదిల్ రసూల్ ఖాన్. స్థానికనిమ్రా విద్యా సంస్థల అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ తమ్మినైనా నారాయణమూర్తి హెల్త్ కేర్ మేనేజ్మెంట్ ఇన్ కార్పొరేట్ హాస్పిటల్ పుస్తకాన్ని రచించారు. గురువారం షాదిల్ రసూల్ ఖాన్ చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ఆవిష్కరణలు ప్రస్తుతం ఎంతో అవసరమని... వైద్యరంగంలో సమాజ చైతన్యానికి, విద్యార్థులలో ఆలోచనా దృక్పథాన్ని పెంపొందించడానికి పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ పఠనా శక్తిని అలవర్చుకోవాలని తెలిపారు. పుస్తకాన్ని రచించిన రచయిత పడిన శ్రమను అభినందిస్తూ, ఈ పుస్తకం పాఠకుల ఆదరణ పొందాలని ఆయన ఆకాంక్షించారు. రచయిత నారాయణమూర్తి మాట్లాడుతూ కార్పొరేట్ హాస్పటల్లో వైద్య సేవల గురించి పుస్తకంలో వివరించినట్లు తెలిపారు. పుస్తకానికి మరో రచయితగా డాక్టర్ అసదుల్లా ఖాన్ వ్యవహరించినట్లు తెలిపారు. పుస్తక రచనకు కళాశాల యాజమాన్యం తమకు ప్రోత్సాహం ఇచ్చినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ అకాడమిక్ డైరెక్టర్ డాక్టర్ సయ్యద్ గులాం గౌస్, వివిధ కళాశాల ప్రిన్సిపల్స్ సిబ్బంది పాల్గొని రచయితలకు అభినందనలు తెలిపారు.

# కొండపల్లి పురః పోరుకు అభ్యర్థుల వేటలో పార్టీలు

**అధికార ప్రతిపక్షానికి ప్రతిష్టాత్మకంగా మారిన ఎన్నికలు**

**వ్యూహాత్మక అడుగులతో సిద్ధమవుతున్న కూటమి, వైసీపీ**

**నేటి నుండి నామినేషన్ల పర్వం**




**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 15(వార్తా ప్రభ ప్రతినిధి):** రేపటినుండి నామినేషన్ల పర్వం ప్రారంభంతో గెలుపే లక్ష్యంగా ప్రధాన రాజకీయ పార్టీలు అభ్యర్థుల ఎంపిక ప్రక్రియను ముమ్మరం చేశాయి. గత మున్సిపల్ ఎన్నికల్లో ఎదురైన హోరాహోరీ పోరును దృష్టిలో ఉంచుకుని, ఈసారి ప్రతి వార్డులోనూ బలమైన అభ్యర్థులను రంగంలోకి దించేందుకు అధికార కూటమి, ప్రతిపక్ష వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తీవ్ర కసరత్తులు చేస్తున్నాయి. కొండపల్లి మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పదవి ఈసారి ఎస్సీ మహిళ కేటగిరీకి రిజర్వ్ అయింది. దీంతో ఆయా సామాజిక వర్గానికి చెందిన సమర్థులైన మహిళా అభ్యర్థుల అన్వేషణలో పార్టీలు నిమగ్నమయ్యాయి.

**ప్రతిష్టాత్మకంగా మారిన కొండపల్లి పోరు** 2021లో జరిగిన ఎన్నికల్లో ఇరు పార్టీల మధ్య తీవ్ర ఉత్కంఠ నెలకొంది. అప్పట్లో టీడీపీ 14, వైసీపీ 14 స్థానాలు గెలుచుకోగా, కోర్టు వివాదాల అనంతరం ఎక్స్ అఫిషియో ఓట్ల సాయంతో టీడీపీ మున్సిపల్ పీఠాన్ని కైవసం చేసుకుంది. ప్రస్తుత అధికార కూటమి ఈ స్థానంలో తమ పట్టును నిలుపుకోవాలని చూస్తుండగా, వైసీపీ గట్టి పోటీ ఇచ్చేందుకు ప్రణాళికలు రచిస్తోంది. నామినేషన్ల ప్రక్రియకు సమయం ఆసన్నమవడంతో రాబోయే రెండు రోజుల్లో అభ్యర్థుల తుది జాబితాలు వెలువడే అవకాశం ఉంది.

# గ్రామీణుల ఆరోగ్యానికి రాజన్న ఫౌండేషన్ భరోసా

**- రూ.3 కోట్లతో దిగువమాఘంలో ఉచిత వైద్య సేవల కేంద్రం**



**తిరుపతి, అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలను ఉచితంగా అందించాలనే సంకల్పంతో రాజన్న ఫౌండేషన్ మరో కీలక అడుగు వేసింది. తిరుపతి సమీపంలోని దిగువమాఘంలో సుమారు రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించనున్న రాజన్న ఆరోగ్య కేంద్రానికి గురువారం భూమిపూజ నిర్వహించారు. రాజన్న ఫౌండేషన్ అధ్యక్షులు, అమర్ రాజా సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా డాక్టర్ గల్లా రామచంద్ర నాయుడు మాట్లాడుతూ ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ ఒక్కరూ వైద్య సేవలకు దూరం కాకూడదన్నదే రాజన్న ఫౌండేషన్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. నూతన ఆరోగ్య కేంద్రం ద్వారా దిగువమాఘం, పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత ప్రాథమిక వైద్య సేవలు అందించనున్నట్లు వెల్లడించారు. ఉచిత వైద్య పరీక్షలతో పాటు ప్రయోగశాల సేవలు, భౌతిక చికిత్స సదుపాయాలను కూడా అందుబాటులోకి తీసుకురానున్నట్లు పేర్కొన్నారు. ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని నిపుణులైన వైద్యులను అందుబాటులో ఉంచుతామని తెలిపారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు, మహిళల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వనున్నట్లు వివరించారు. అంతేకాకుండా, నెలకు రెండుసార్లు అమరా ఆసుపత్రికి చెందిన ప్రత్యేక వైద్యులు ఈ కేంద్రాన్ని సందర్శించి సేవలందిస్తారని చెప్పారు. దీనివల్ల గ్రామీణ ప్రజలు వైద్య సేవల కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆరోగ్య కేంద్రం నిర్మాణం పూర్తయి సేవలు ప్రారంభమైన అనంతరం దిగువమాఘం, పరిసర గ్రామాల ప్రజలకు ఉచిత ప్రాథమిక వైద్య సదుపాయాలు స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయి. గ్రామీణ వైద్య సేవలను బలోపేతం చేయడంతో పాటు ప్రజల ఆరోగ్య ప్రమాణాలను మెరుగుపరచడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషించనుంది. ఈ కార్యక్రమంలో రాజన్న ఫౌండేషన్ అధిపతి రాళ్లపల్లి సతీష్, మాజీ సర్పంచులు కుమార్ నాయుడు, పరంధామ నాయుడు, గోపి, సమీప గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

# కొండలమ్మ మహా అన్నసమారాధన విరాళాలకు ఆహ్వానం...



**గుడ్లవల్లేరు: అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలం వేమవరం గ్రామంలో వెంచేసిన శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో శ్రీ దేవి శరన్నవరాత్రుల సందర్భంగా ఈ నెల 18వ తేదీన జరుగు మహా అన్నసమారాధనకు ధన, వస్తువుల రూపేణా విరాళాలను ఆహ్వానిస్తున్నట్లు దేవస్థాన చైర్మన్ ఈడే వెంకట విష్ణు మోహన్‌రావు, ఈఓ ఆకుల కొండలరావు కోరారు. గురువారం మహా అన్నసమారాధన నిమిత్తం హైదరాబాద్ వాస్తవ్యులు వేణుగోపాలాచార్యులు 250 కేజీలు, మరొక భక్తుడు 100 బియ్యం విరాళంగా ఇచ్చారని పేర్కొన్నారు. వారిని చైర్మన్ మోహన్, ఈఓ కొండలరావు సత్కరించి ప్రసాదం అందజేశారు. ఈ మహా అన్నసమారాధనకు ధన, వస్తువుల రూపేణా విరాళాలను సమర్పించే దాతలు తప్పనిసరిగా రశీదు తీసుకోవలసిందిగా కోరారు.

# సత్యమ్మ తల్లికి కోగంటి సత్యం పూజలు

**విగ్రహ ప్రతిష్టకు లక్ష విరాళం**

**దసరా ఉత్సవాల అన్న సంతర్పణకు అల్తాఫ్ బాబా వితరణ**



**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 15(వార్తా ప్రభ ప్రతినిధి):** దసరా శరన్నవరాత్రులు పురస్కరించుకొని కొండపల్లి, ఇబ్రహీంపట్నం లో ప్రముఖ పారిశ్రామిక వేత్త కోగంటి సత్యం పర్యటించారు. దసరా ఉత్సవాల్లో భాగంగా కొండపల్లి మున్సిపాలిటీ లో కొలువైన అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇబ్రహీంపట్నం లో నిర్మాణ దశ లో ఉన్న సత్యమ్మ తల్లి ఆలయాన్ని సందర్శించిన ఆయన గుడి నిర్మాణం, విగ్రహ ప్రతిష్ట వివరాలు అడిగి తెలుసుకున్నారు. సత్యమ్మ తల్లి ఆలయ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు విగ్రహ ప్రతిష్ట కు లక్ష రూపాయలు విరాళం గా ప్రకటించారు. అనంతరం కొండపల్లి గాయత్రి నగర్ పురాతన ఆలయం గాయత్రీ దేవి ఆలయాన్ని సందర్శించి గాయత్రి దేవిని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కి సహకారం అందిస్తానని కమిటీ సభ్యులకు హామీ ఇచ్చారు. కొండపల్లి లో వివిధ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న దసరా నవరాత్రి విగ్రహాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోగంటి సత్యం తో పాటు కొండపల్లి సయ్యద్ హజరత్ షా బుకారి బాబా ఆస్థాన పీఠాధిపతి మహమ్మద్ అల్తాఫ్ రజా సైతం అమ్మవారి దర్శనం చేసుకుని అన్నసంతర్పణ కు విరాళాలు అందజేశారు. ఇబ్రహీంపట్నం సత్యమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ట కు 5వేలు ఆర్థిక సహాయం, గాయత్రీ దేవి ఆలయంలో అన్నసంతర్పణ కు 3 వేలు విరాళం అందజేసి భిన్నత్వం లో ఏకత్వానికి నిదర్శనం గా నిలిచారు.

# చిత్తూరు మేయర్ పీఠం యాదవులకే ఇవ్వాలి

**అఖిల భారత యాదవ మహా సంఘం**

**చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పి. నవీన్ యాదవ్**

**చిత్తూరు: అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ పదవికి బీసీ వర్గానికి చెందిన యాదవ సామాజికవర్గం నాయకులకు అవకాశం కల్పించాలని అఖిల భారత యాదవ మహా సంఘం చిత్తూరు జిల్లా అధ్యక్షుడు పి. నవీన్ యాదవ్ అన్ని రాజకీయ పార్టీల అధిష్టానాలను కోరారు. నగర అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న యాదవులకు రాజకీయంగా సముచిత ప్రాధాన్యం కల్పించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. చిత్తూరు నగరంలో యాదవ సామాజికవర్గానికి గణనీయమైన జనాభా ఉందని, సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలతో పాటు నగర అభివృద్ధిలోనూ ఆ వర్గం ప్రజలు తమవంతు పాత్ర పోషిస్తున్నారని నవీన్ యాదవ్ పేర్కొన్నారు. అనేక సంవత్సరాలుగా వివిధ రాజకీయ పార్టీల అభివృద్ధికి, విజయాలకు యాదవులు అండగా నిలుస్తున్నప్పటికీ, జనాభా నిష్పత్తికి, సామాజిక సేవకు తగిన స్థాయిలో రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యాదవ సామాజికవర్గానికి చెందిన సమర్థులైన నాయకులకు చిత్తూరు నగరపాలక సంస్థ మేయర్ పదవిలో అవకాశం కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అన్ని రాజకీయ పార్టీలు యాదవులకు తగిన రాజకీయ ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు, వెనుకబడిన తరగతుల రాజకీయ సాధికారతకు కట్టుబడి ఉండాలని సూచించారు. నగర అభివృద్ధిలో భాగస్వాములైన యాదవులకు పాలనలోనూ సముచిత స్థానం కల్పించాలని కోరారు. అఖిల భారత యాదవ మహా సంఘం ఏ ఒక్క రాజకీయ పార్టీకి పరిమితం కాదని, పార్టీలకు అతీతంగా యాదవుల హక్కులు, ఆత్మగౌరవం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం కృషి చేస్తుందని స్పష్టం చేశారు. మేయర్ పదవికి



వర్తించే చట్టబద్ధమైన రిజర్వేషన్ నిబంధనలను గౌరవిస్తూ, అర్హత కలిగిన యాదవ నాయకులకు అన్ని పార్టీలు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. యాదవుల ఐక్యతే తమ బలమని, సామాజిక అభివృద్ధితో పాటు రాజకీయ సాధికారత సాధించడమే లక్ష్యమని నవీన్ యాదవ్ పేర్కొన్నారు.

# ది సిటిజన్ కో-ఆపరేటివ్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నగదు ప్రశంసా పత్రాల ప్రధానం



**మచిలీపట్నం, అక్టోబర్ 15 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మచిలీపట్నంలోని ది సిటిజన్ కో ఆపరేటివ్ సొసైటీ కార్యాలయం నందు ఈరోజు ప్రతిభ చూపిన విద్యార్థులకు నగదు మరియు ప్రశంసా పత్రాల బహుకరణ కార్యక్రమం జరిగింది. పదవ తరగతి మరీ ఇంటర్మీడియట్ విద్యార్థులలో ప్రతిభ చూపిన విద్యార్థులను బ్యాంకు సొసైటీ మేనేజ్మెంట్ వారు నగదు పురస్కారాలు మరియు ప్రశంసా పత్రాలు బహుకరించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్ ఏ కోటేశ్వరరావు మాట్లాడుతూ46 బ్రాంచి లలో ఈ సంవత్సరం వరకు(2025-2026) రెండు కోట్ల 56 లక్షల పదివేల రూపాయలు చెక్కులు అందజేశారు విద్యార్థులకు నగదు పురస్కారము అందించారు మచిలీపట్నంలో 14 మంది విద్యార్థులు ఎంపిక చేసి నగదు పురస్కారం ప్రశంసా పత్రం పొందారు. విద్యార్థులు కష్టపడి చదివి మంచి మార్కులు తెచ్చుకున్నప్పుడు ప్రతి ఒక్కరిని గుర్తించి నగదు పురస్కారాలు అందజేయడం జరుగుతుందని కావున విద్యార్థులు అందరూ బాగా చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించి తల్లిదండ్రులకు సొసైటీకి మంచి పేరు తెచ్చుకోవాలని సందర్భంగా ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సిబ్బంది పీ శ్రీకాంత్ బ్రాంచ్ మేనేజర్ సిబ్బంది పాల్గొన్నారు.

# బికొండపల్లి జడ్పీ బాలికల హైస్కూల్ లో నామినేషన్లు

**- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు**

**- నేటి నుంచి మున్సిపల్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ**




**ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 15 (వార్తా ప్రభ ప్రతినిధి):** మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి అభ్యర్థుల నామినేషన్ల ప్రక్రియకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. కొండపల్లి జిల్లా పరిషత్ బాలికల హైస్కూల్ లో చైర్ పర్సన్, వార్డు కౌన్సిలర్ అభ్యర్థులు నామినేషన్లు వేసేందుకు ఏర్పాట్లు చేశారు. ఈ నెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు నామినేషన్లు



స్వీకరించనున్నారు. ఉదయం 11:00 గంటల నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియ మధ్యాహ్నం 3:00 గంటలకు ముగుస్తుంది. నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు సహాయకులుగా ఇద్దరిని మాత్రమే అనుమతించనున్నారు. నామినేషన్ కేంద్రం వెలుపల గేటుకు రెండు వైపులా 100 మీటర్ల దూరంలో వాహనాలు నిలుపుదల చేయాల్సి ఉంటుంది. శుక్రవారం వార్డుల వారీగా ఓటర్ల జాబితాలు ప్రదర్శించనున్నారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఎన్నికల మెటీరియల్ పంపిణీ, ఎన్నికల అనంతరం రిసెప్షన్ సెంటర్, స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ సెంటర్ లను జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలోనే ఏర్పాటు చేశారు.

# ఆపరేషన్ త్రిశూల్‌లో భాగస్వామ్యం కండి

**చింతపల్లి, అక్టోబర్ 15 (వార్తా ప్రభ ప్రతినిధి)**:రోడ్డు ప్రమాదాల నివారణ, గంజాయి నిర్మూలన, మహిళల భద్రత లక్ష్యంగా ఏర్పాటయిన ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమంలో గిరిజనులంతా భాగస్వామ్యులు కావాలని అల్లూరు జిల్లా ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. గురువారం గూడెం కొత్త వీధి మండల కేంద్రంలో జరుగుతున్న వారపు సంతలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన ఎస్పీ ఆపరేషన్ త్రిశూల్ కార్యక్రమానికి సంబంధించిన అంశాలను వివరించారు. చింతపల్లి ఏఎస్పీ యాదవరావు, నిరంజన్, మహేంద్ర సిన్హ, తహసీల్దార్ అన్నాజీ రావు, ఎస్సై సురేష్ పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం నాయకులు

**కూకట్ పల్లి, అక్టోబర్ 15(వార్తా ప్రభ)** ఎమ్మెల్యే పీఏసీ చైర్మన్ అరేకపూడి గాంధీ జన్మదిన సందర్భంగా వారిని వారి నివాసం లోని కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి శాలువుతో సత్కరించి, వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి చిత్రపటాన్ని బహుకరించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన వేములవాడ మున్నూరు కాపు సంఘం నిత్యాన దాన సత్రం ఉపాధ్యక్షులు చింతపంటి భూమయ్య, తెలంగాణ రాష్ట్ర మున్నూరు కాపు సంఘం నాయకులు పోతుల రాజేందర్, అల్లం మహేష్, రాకేష్, వెంకట్రావు, రాజు, వెంకటేష్, రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ తదితరు పాల్గొని జన్మదిన శుభాకాంక్షలు తెలియజే శారు.



## వైభవంగా దసరా శరన్నవరాత్రి వేడుకలు

**అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసిన కుంట సిద్ధిరాములు**





**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** దుర్గా శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఎం.ఎన్.రెడ్డి నగర్‌లో అమ్మవారికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పవిత్ర వేడుకల్లో భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకుని తమ మొక్కులు చెల్లించుకున్నారు.

**ఘనంగా అన్నదాన కార్యక్రమం** పూజా కార్యక్రమాల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తుల కోసం భారీగా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో కాలనీవాసులు, మహిళలు, పెద్దలు విశేష సంఖ్యలో పాల్గొని అమ్మవారి తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ వేడుకల్లో బీఆర్ఎస్ నాయకులు కుంట సిద్ధిరాములు ముఖ్య అతిథిగా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు, కాలనీ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## ఎమ్మెల్యే గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బలరామ్ యాదవ్



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 15 (వార్తాప్రభ):**శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జన్మదినం సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు బలరామ్ యాదవ్ ఆయనను కలిసి శాలువాతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజమోహన్‌రావు, నాగరాజు, రేపల్లె అశోక్, మాధవ్, వెంకటయ్య, ప్రేమ్,సాయి చరణ్, మల్లికార్జున్,రవితేజ, తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే గాంధీకి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మిరియాల ప్రీతమ్, రాఘవరావు



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 15 (వార్తాప్రభ):** శేరిలింగంపల్లి ఎమ్మెల్యే, పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ జన్మదినం సందర్భంగా మిరియాల ప్రీతమ్, మిరియాల రాఘవరావు ఆయన నివాసానికి వెళ్లి గజమాలతో ఘనంగా సత్కరించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.గాంధీ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ప్రజలకు మరిన్ని సేవలందిస్తూ ప్రజాజీవితంలో కొనసాగాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విష్ణుమూర్తి, జగన్నాథరావు, చలం, కృష్ణ, త్రినాథ్, ప్రసాద్, పరదేశి నాయుడు, శ్యామలరావు, వెంకట్రావు, విష్ణు, సాయి, త్రిలోచన్ తదితరులు పాల్గొన్నారు.

## వైభవోపేతంగా ఎమ్మెల్యే గాంధీ జయంతోత్సవ వేడుకలు



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 15 (వార్తాప్రభ):**పీఏసీ చైర్మన్, శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ జన్మదిన వేడుకలు అంబరాన్నంటాయి.వివేకానంద నగర్‌లోని ఆయన నివాసంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ కార్పొరేటర్లు నార్నె శ్రీనివాసరావు, ఉప్పలపాటి శ్రీకాంత్, కంటెస్టెంట్ కార్పొరేటర్ బండారు మోహన్ ముదిరాజ్, సీనియర్ నాయకుడు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.గాంధీని మర్యాదపూర్వకంగా కలిసి కేక్ కట్ చేసి, శాలువాతో సత్కరించి, పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా నిర్వహించిన సర్వమత ప్రార్థనలు వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.ఈ కార్యక్రమంలో నాయకులు,కార్యకర్తలు,అభిమానులు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పేద ప్రజలకు భరోసా

## సీఎంఆర్ఎఫ్ ద్వారా రూ. 1.85 లక్షల విలువైన ఎల్ఓసీ చెక్కులు అందజేత

**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 15, (వార్తాప్రభ) :** అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న బాధితులకు కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు, బీఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ భరోసానిచ్చారు. ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన ఆర్థిక సహాయ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు.

**వైద్యం కోసం ఆర్థిక సహాయం** కుత్బుల్లాపూర్ గ్రామానికి చెందిన జి. ఎల్లయ్య (53), తిరుమలనగర్ (బాచుపల్లి) నివాసి వై. సుబ్బాయమ్మ (67) అనారోగ్య సమస్యల కారణంగా వైద్యం కోసం ఇబ్బందులు పడుతూ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను ఆశ్రయించారు. స్పందించిన ఎమ్మెల్యే వారి వైద్య ఖర్చుల నిమిత్తం ఎల్లయ్యకు రూ. 1,10,000/- మరియు సుబ్బాయమ్మకు రూ. 75,000/- చొప్పున మొత్తం రూ. 1,85,000/- విలువగల లేఖ (ఎల్ఓసీ) చెక్కులను మంజూరు చేయించారు. చింతల్‌లోని కార్యాలయంలో స్థానిక బీఆర్ఎస్ నాయకుల ద్వారా ఈ చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. ఆపద సమయంలో తమకు అండగా నిలిచి ఆర్థిక సాయం అందించిన ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు బాధిత కుటుంబాలు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నిజాంపేట మున్సిపల్ కార్పొరేషన్ మాజీ డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్, పార్టీ అధ్యక్షులు రంగరాయ ప్రసాద్, చంద్ర వెంకటేశ్వర రావు, 132వ డివిజన్ నాయకులు కుంట సిద్ధిరాములు, సంపత్ మాధవ రెడ్డి, నరేందర్ రెడ్డి, సమ్మయ్య నేత, ఆటో బలరాం, జయం చారి, చంద్రశేఖర్ రెడ్డి, నార్లకంటి శ్యాం, కాలే నాగేష్, కాలే గణేష్, బాల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.



## దివ్యాంగుల ఆత్మవిశ్వాసం, స్వావలంబనకు సమాజం అండగా నిలవాలి: ఎమ్మెల్యే కేపీ వివేకానంద్



**కుత్బుల్లాపూర్, అక్టోబర్ 15, (వార్తాప్రభ) :** లూయిస్ బ్రెయిలీ భవన్‌లో ప్రపంచ తెల్లకర్ర దినోత్సవం, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కుత్బుల్లాపూర్ శాసనసభ్యులు, బీఆర్ఎస్ఎల్పీ విప్ కేపీ వివేకానంద్ ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ మాట్లాడుతూ.. దృష్టిలోపం ఉన్నవారికి తెల్లకర్ర కేవలం నడకకు ఉపయోగపడే పరికరం మాత్రమే కాదని, అది వారి ఆత్మవిశ్వాసానికి, స్వతంత్ర జీవనానికి ప్రతీక అని పేర్కొన్నారు. దివ్యాంగులు సమాజంలో ఆత్మగౌరవంతో జీవించేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. వారి ప్రతిభను గుర్తించి విద్య, ఉపాధి రంగాల్లో సమాన అవకాశాలు కల్పించడం అందరి బాధ్యత అని అన్నారు. అలాగే, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని.. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ సురేష్ రెడ్డి, డివిజన్ అధ్యక్షుడు పోలే శ్రీకాంత్, కొంపల్లి మాజీ మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలం యాదవ్, స్థానిక సీనియర్ నాయకులు వరాల వినోద్, కోలా శ్రీకాంత్, గుబ్బల లక్ష్మీనారాయణ, గట్టు అశోక్, రాజ్ కుమార్, జన్ముల ప్రభాకర్, రాంబాబు, బైరేష్ గౌడ్, సత్యం గౌడ్, చిన్న వెంకటస్వామి, రాజు, అనీల్, గణేష్, మటన్ మహమూద్, బద్రి, జహీర్, లూయిస్ బ్రెయిలీ భవన్ ప్రతినిధులు, నిర్వాహకులు అంజయ్య గౌడ్, ప్రవీణ్ గౌడ్, వీర రాఘవన్, యాదయ్య యాదవ్, నరేందర్ రెడ్డి, శేఖర్ గౌడ్ తదితరులు, స్థానిక నాయకులు మరియు పెద్ద సంఖ్యలో దివ్యాంగులు పాల్గొన్నారు.

## కూలిన స్కూల్ పైకప్పు - 28 మంది విద్యార్థులు, టీచర్ మృతి



పాకిస్థాన్ : పాకిస్థాన్‌లోని పెషావర్‌లో ఉన్న ఓ ప్రైవేటు స్కూల్ లో పైకప్పు కూలి 29 మంది మృతి చెందారు. వీరిలో 28 మంది విద్యార్థులు, ఓ మహిళా టీచర్ ఉన్నారు. మరణించిన విద్యార్థుల్లో అబ్బాయిలు, అమ్మాయిలు ఉన్నారు. బాధితుల్లో ఏడు నుంచి 12 ఏళ్ల మధ్య వయసున్న విద్యార్థులున్నారు. పెషావర్ ఆస్పత్రిలో ప్రస్తుతం ఎమర్జెన్సీ ప్రకటించారు. అల్ ఖైర్ స్కూల్ రూఫ్ కూలినట్లు పెషావర్ డిప్యూటీ కమిషనర్ అఫక్ వాజిర్ తెలిపారు. శిథిలాల కింద విద్యార్థులు చిక్కుకున్నారు. రూఫ్ కూలిన సమయంలో విద్యార్థులు క్లాస్‌రూముల్లో ఉన్నట్లు తెలిసింది. ప్రస్తుతం రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోంది. శిథిలాలను తొలగిస్తున్నారు. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ప్రమాదం నేపథ్యంలో పాఠశాల యజమానిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటన పట్ల పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. తక్షణ చర్యలకు ఆదేశించారు. విద్యార్థులే మన పెట్టుబడి అని, వాళ్లను కోల్పోవడం తీవ్ర విషాదమేనని ఆయన పేర్కొన్నారు.

## ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్ యూఏఈదే..




దుబాయ్: ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌గా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) పాస్‌పోర్ట్ నిలిచింది. గ్లోబల్ పాస్‌పోర్ట్ ఇండెక్స్‌లో యూఏఈ తొలి స్థానాన్ని దక్కించుకుంది. ఈ జాబితాలో భారత్ 72వ స్థానంలో నిలిచింది. యూఏఈ పాస్‌పోర్ట్ ఉన్నవారు ముందస్తు వీసా లేకుండా లేదా సులభమైన ప్రవేశ అనుమతులతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలకు ప్రయాణించవచ్చు. మొత్తం 182 దేశాలకు సులభంగా వెళ్లే అవకాశం ఉండగా, వీటిలో 138 దేశాలకు పూర్తిగా వీసా లేకుండా ప్రవేశించవచ్చు.

## హోటళ్లకు ఇక ఫుల్ వంటగ్యాస్

**వాణిజ్య ఎల్పీజీ సరఫరాపై ఆంక్షలు ఎత్తివేసిన కేంద్రం**



**న్యూఢిల్లీ :** హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర వాణిజ్య అవసరాలకు వంటగ్యాస్ సరఫరాపై ఉన్న ఆంక్షలను కేంద్రం ఎత్తివేసింది. అమెరికా-ఇరాన్ సైనిక ఘర్షణ కారణంగా దిగుమతుల్లో ఇబ్బందులు తలెత్తటంతో గృహ వినియోగదారులకు కొరత రాకుండా చూసేందుకు వాణిజ్య అవసరాలకు ఎల్పీజీ సరఫరాపై కేంద్రం గతంలో ఆంక్షలు విధించిన విషయం తెలిసిందే. పరిశ్రమలకు నాడు ఎల్పీజీ సరఫరాను పూర్తిగా నిలిపివేసింది. తాజాగా దేశీయంగా ఉత్పత్తి పెరగటంతోపాటు పర్షియన్ గల్ఫ్ నుంచి ఎల్పీజీ ట్యాంకర్లు మనదేశానికి వస్తుండటంతో హోటళ్లు, రెస్టారెంట్లకు సరఫరాను యుద్ధం పూర్వపు స్థితికి పునరుద్ధరిస్తున్నట్లు పెట్రోలియం శాఖ గురువారం విడుదల చేసిన ప్రకటనలో పేర్కొంది.

## వ్యాక్సిన్లు, క్యాన్సర్ మందులపై క్యూఆర్ కోడ్



**నకిలీ మందుల కట్టడికి కేంద్రం చర్యలు**

న్యూఢిల్లీ : నకిలీ, నాసిరకం మందులను అరికట్టడానికి, ఔషధాల సరఫరాలో పారదర్శకతను పెంచడానికి కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ కీలక చర్యలు చేపట్టింది. ఇకనుంచి అన్ని రకాల వ్యాక్సిన్లు, క్యాన్సర్ మందులు, యాంటీబయాటిక్స్, నార్కోటిక్, సైకోట్రోపిక్ మందుల ప్యాకేజింగ్ లేబుల్‌పై బార్ కోడ్ లేదా క్యూఆర్ కోడ్‌ను ముద్రించడాన్ని తప్పనిసరి చేసింది. ఈ మేరకు 'డ్రగ్స్ రూల్స్ 1945'కు సవరణలు చేసింది. వీటిప్రకారం ఈ క్యాటగిరీ మందులు షెడ్యూల్ హెచ్2 పరిధిలోకి వస్తాయి. వీటిపై ఉండే క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసినప్పుడు మందుల ప్రామాణికతను తెలుసుకోవచ్చు. గతంలో క్యూఆర్ కోడ్ నిబంధన దేశంలోని 300 అగ్రశ్రేణి ఫార్మా బ్రాండ్‌లకు మాత్రమే ఉండేదని, తాజా సవరణతో దీని పరిధిని విస్తరించామని ఆరోగ్యశాఖ తెలిపింది.

## వరంగల్ ఖమ్మం నల్గొండ ఎమ్మెల్సీ పట్టభద్రుల కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించండి.

**పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి**



**తొర్రూరు అక్టోబర్ 15 (వార్తాప్రభ):** వరంగల్-ఖమ్మం--నల్గొండ పట్టభద్రుల ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించాలని పాలకుర్తి నియోజకవర్గం ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీ రెడ్డి లు అన్నారు. గురువారం హన్మకొండలోని మడికొండ సత్యసాయి గార్డెన్‌లో నిర్వహించిన ఎన్నికల సన్నాహక సమావేశంలో పాలకుర్తి శాసనసభ్యురాలు యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాన్ల ఝాన్సీ రెడ్డిలు పాల్గొని మాట్లాడుతూ పది సంవత్సరాలు నియంత పాలన కొనసాగించిన కేసీఆర్ ప్రభుత్వాన్ని మట్టిగరిపించి రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ప్రజల పక్షాన నిలబడి ప్రజాపాలన కొనసాగిస్తూ ప్రజాకర్షక పథకాలు ప్రవేశపెట్టి తక్షణమే అమలు చేస్తున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎమ్మెల్సీ ఓటర్లందరూ అధిక సంఖ్యలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. హనుమకొండలో నిర్వహించిన ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశంలో పాలకుర్తి నియోజకవర్గం నుండి అధిక సంఖ్యలో పాల్గొని ఈ సన్నాహక సమావేశాన్ని జయప్రదం చేసిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలకుర్తి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మాతృక ఫెర్టిలిటీ అండ్ లాపరోస్కోపిక్ సెంటర్ శుభారంభం



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 15 (వార్తాప్రభ):** కొండాపూర్ డివిజన్‌లోని రాఘవేంద్ర నగర్ కాలనీ హైటెన్షన్ రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన మాతృక ఫెర్టిలిటీ అండ్ లాపరోస్కోపిక్ సెంటర్ గురువారం ఘనంగా ప్రారంభమైంది.ఈ కార్యక్రమానికి కొండాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా కేంద్రం మేనేజింగ్ డైరెక్టర్లు డాక్టర్ సాయి శివ, డాక్టర్ పూజాలకు హమీద్ పటేల్ శుభాకాంక్షలు తెలిపారు.సంతాన సాఫల్య చికిత్సలు,లాపరోస్కోపిక్ వైద్య సేవలు,కాస్మెటిక్ గైనకాలజీ విభాగాల్లో నాణ్యమైన వైద్య సేవలు అందించడమే లక్ష్యంగా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

## అబ్దుల్ కలాం ఆదర్శాలు నేటి యువతకు స్ఫూర్తిదాయకం

**మాజీ కార్పొరేటర్ ముద్దు లచ్చిరెడ్డి.**




**ఎల్బీనగర్/వార్తప్రభ(అక్టోబర్ 15):**భారతరత్న,మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి (ప్రపంచ విద్యార్థుల దినోత్సవం) సందర్భంగా బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ సచివాలయ నగర్‌లో స్ఫూర్తి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా నివాళులర్పించారు. మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి కలాం విగ్రహానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. సాంకేతిక రంగంలో దేశాన్ని అగ్రగామిగా నిలిపిన కలాం సేవలు అనన్యసామాన్యమని, ప్రతి ఒక్కరూ ఆయన అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు విజయ్ నేత, రవి శంకర్, స్ఫూర్తి సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

## భక్తులను అలరించిన నిహాల్ ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు



**శేరిలింగంపల్లి,అక్టోబర్ 15 (వార్తాప్రభ):**అన్నమాచార్య భావనా వాహిని ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న నాదబ్రహ్మోత్సవం--26లో భాగంగా గురువారం ప్రముఖ నేపథ్య గాయకుడు నిహాల్ ఆలపించిన అన్నమయ్య సంకీర్తనలు భక్తులను అలరించాయి.ఆయన మధుర గానం భక్తులను భక్తిపారవశ్యంలో ముంచెత్తింది.ఈ కార్యక్రమానికి తెలుగు విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్, సాహిత్యవేత్త గౌరీ శంకర్, జె.వి. పబ్లికేషన్స్ ముఖ్య కార్యనిర్వహణాధికారి, రచయిత్రి జ్యోతి వల్లభోజు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. తొలుత లలితా సహస్రనామం, విష్ణు సహస్రనామం, లక్ష్మీ అష్టోత్తరం, అన్నమాచార్య అష్టోత్తరం పారాయణాలు నిర్వహించారు. అనంతరం నిహాల్ 'మొగదాకిరి వాడు', 'కొండలలో నెలకొన్న', 'అదివో అల్లదివో', 'చాలదా హరినామము', 'సిరుత నవ్వులవాడే సిన్నెక్కా' తదితర సంకీర్తనలను ఆలపించారు. రాజు కీబోర్డుపై, స్వరూప్ తబలాపై వాయిద్య సహకారం అందించారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథులు మాట్లాడుతూ, పద్మశ్రీ డా.శోభారాజు ఆధ్వర్యంలో అన్నమాచార్య భావనా వాహిని అన్నమయ్య సంకీర్తనలను విస్తృతంగా ప్రచారం చేస్తూ,కళాకారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. అన్నమయ్య సాహిత్యాన్ని భావితరాలకు అందించడంలో సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు.అనంతరం సంస్థ వ్యవస్థాపకురాలు పద్మశ్రీ డా. శోభారాజు, మేనేజింగ్ ట్రస్టీ డా. నందకుమార్ ముఖ్య అతిథులు, గాయకుడు నిహాల్, వాయిద్య కళాకారులను వేంకటేశ్వర స్వామి జ్ఞాపికలతో సత్కరించారు.మంగళహారతి, ప్రసాద నివేదనతో కార్యక్రమం ముగిసింది.

# లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో శ్రీ కనకదుర్గమ్మ తల్లి దర్శనం



**ఆగిరిపల్లి,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** ఆగిరిపల్లి వరాహ పుష్కరిణి(మెట్ల కోనేరు) సమీపంలో స్వయంభువుగా పూజలందుకుంటున్న శ్రీ కనకదుర్గమ్మ తల్లి దసరా నవరాత్రులు పురస్కరించుకుని, గురువారం త్రిపుర సుందరీ దేవి అలంకరణతో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణ అధికారి సీ.హెచ్.సాయి పర్యవేక్షణలో ప్రధాన అర్చకులు దేవులపల్లి శ్రీనివాస్ ఆధ్వర్యంలో లలిత సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, చండీ హోమం నిర్వహించారు. లలిత త్రిపుర సుందరి దేవి అలంకరణలో కొలువుదీరిన అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు తరలివచ్చి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. దీంతో ఆలయ పరిసరాలు ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్నాయి. ఈ సందర్భంగా ప్రధాన అర్చకులు మాట్లాడుతూ,లలితా సహస్రనామం అమ్మవారి వెయ్యి పవిత్ర నామాలతో కూడిన స్తోత్రం. భక్తిశ్రద్ధలతో పారాయణం చేయడం ద్వారా మనశ్శాంతి, ఆధ్యాత్మిక ఏకాగ్రత, అమ్మవారిపై భక్తి పెరుగుతాయని భక్తుల విశ్వసిస్తారు. అమ్మవారి అనుగ్రహం కోసం ప్రార్థన "శ్రీమాతా శ్రీ మహారాజ్ఞీ శ్రీమత్ సింహాసనేశ్వరీ" అమ్మవారి దివ్య నామస్మరణతో సకల జనులకు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు, అష్టైశ్వర్యాలు కలగాలని భక్తులు ప్రార్థిస్తారు. మధ్యాహ్నం భక్తుల ఆర్థిక సహకారంతో ఆలయ ప్రాంగణంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సాయంత్రం లలితా సహస్రనామ పారాయణం, కుంకుమార్చన, బలిహరణ కార్యక్రమాలు చేపట్టారు. అమ్మవారి కృపాకటాక్షాలు అందరిపై ఉండాలని భక్తులు ప్రార్థించారు

# దేవి నవరాత్రుల సందర్భంగా 5వ రోజు పలు దేవాలయలో అలంకారాలు







**గుడివాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** గురువారం గుడ్లవల్లేరు మండలం వేమవరం గ్రామంలోని శ్రీ కొండాలమ్మ అమ్మవారి ఆలయంలో శ్రీదేవి శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా అమ్మవారు శ్రీ లలితాదేవి అలంకారంలో దర్శనమిచ్చారు. పట్టణంలోని బంటుమిల్లి రోడ్డు లోని శ్రీ భీమేశ్వరస్వామి వారి ఆలయంలో 5వ రోజు శ్రీ గజలక్ష్మీ దేవి అలంకరణలో అమ్మవారి భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆలయ ధర్మకర్తల కమిటీ చైర్మన్ పట్టపు చిన్న, ఈవో కందుల వేణుగోపాలరావు తెలిపారు. గౌరీశంకర స్వామి వారి దేవస్థానంలో (చిన్నశివాలయంలో) శ్రీగాయత్రీదేవి అలంకారంలో దర్శనమిచ్చినట్లు ఈవో కందుల వేణుగోపాలరావు, కమిటి చైర్మన్ నేరుసు సుభాష్‌చంద్రబోస్‌లు తెలిపారు.

# ఎమ్మెల్యే గాంధీ కి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన బి.సి.నేత భేరి



**హైదరాబాద్, అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి ప్రదాత, పిఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరేకపూడి గాంధీ కి బీసీ కులాల ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు భేరి రామచంద్ర యాదవ్, ఎర్రగుడ్ల శ్రీనివాస్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు అందేలా కుమార్ యాదవ్, సిరిపురం హరికృష్ణ చారి బీసీ కులాల ఐక్యవేదిక ఆర్గనైజింగ్ సెక్రటరీ, మరియు పెద్ద ఎత్తున ప్రజా ప్రతినిధులు శ్రేయోభిలాషులు ఎమ్మెల్యే అరికెపూడి గాంధీ కి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా బేరి రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ మునుమందు ఉన్నత పదవులు రావాలని మరింత నిరంతరం ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్నటువంటి ఎమ్మెల్యే కి మునుముందు ఉన్నత పదవులు రావాలని మనస్ఫూర్తిగా భగవంతుని వేడుకున్నారు.

# టాగూర్ గ్రంథాలయంలో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి వేడుకలు

-విద్యార్థులకు స్ఫూర్తి ప్రదాత డాక్టర్ అబ్దుల్ కలాం

**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** స్థానిక మహాత్మా గాంధీ రోడ్డులోని టాగూర్ స్మారక గ్రంథాలయంలో భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.గ్రంథాలయాధికారి కే రమాదేవి డాక్టర్ అబ్దుల్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు ఆయన జీవిత విశేషాలను, బాల్యం నుంచి ఎన్నో కష్టాలను అధిగమించి గొప్ప శాస్త్రవేత్తగా, భారత రాష్ట్రపతిగా ఎదిగిన విధానాన్ని వివరించారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే పెద్ద లక్ష్యాలను ఏర్పరచుకొని, క్రమశిక్షణతో చదువుతూ, పట్టుదలతో తమ లక్ష్యాలను సాధించాలని కలాం జీవితం మనకు తెలియజేస్తుందని పేర్కొన్నారు. యువతలో శాస్త్రీయ దృక్పథాన్ని, దేశభక్తిని, సేవాభావాన్ని పెంపొందించుకోవాలని సూచించారు.ప్రతి విద్యార్థి కలలు కనండి ఆ కలలను సాకారం చేసుకోండి కష్టపడి చదవండి భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించండి అని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో



గ్రంథాలయ సిబ్బంది వై ధనలక్ష్మి, ఎం వెంకటేశ్వర్లు వివిధ స్కూల్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా అబ్దుల్ కలాం 95వ జయంతి



**గుడివాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా పట్టణా బిజెపి నాయకులు మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) అధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గురువారం స్థానిక బిజెపి కార్యాలయంలో డాక్టర్ ఏపిజె అబ్దుల్ కలాం 95వ జయంతి ఘనంగా నిర్వహించారు. సందర్భంగా మచిలీపట్నం పార్లమెంటరీ కన్వీనర్ సురే గాంధీ, లింగం చిట్టిబాబుల చేతుల మీదగా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆర్‌కె మాట్లాడుతూ మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చెప్పినట్లు కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అంటూ భారత యువతను తట్టి లేపిన మహోన్నత వ్యక్తి అన్నారు. ఈయనను స్ఫూర్తిగా తీసుకొని దేశ సమాజం కోసం అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువమోర్చా నాయకులు గాదంశెట్టి ఫణి కుమార్, సోషల్ మీడియా కన్వీనర్ గోపి, దుర్గకుమారి, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సిమెంటు , ఇనుము మాయంపై రాష్ట్ర గృహనిర్మాణ మేనేజింగ్ డైరెక్టర్‌ను నివేదిక కోరిన రాష్ట్ర ఉపలోకాయుక్త..



**అవనిగడ్డ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** గృహనిర్మాణ శాఖ ఆధీనంలోని సిమెంట్, ఇనుము మాయం కావడంపై రాష్ట్ర ఉప లోకాయుక్త జస్టిస్ పి.రజనీ నివేదిక కోరుతూ ఆశాఖ ఎండి ని ఆదేశిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. కృష్ణాజిల్లా, పెనమలూరు, కంకిపాడు, తొట్లవల్లూరు మండలాలకు సంబంధించి ఇనుము , సిమెంట్ మాయం అవటంపై రాష్ట్ర ఉపలోకాయుక్త జస్టిస్ పి.రజని, రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమతి హెప్సిబారాణి కొర్లపాటి ని నివేదిక కోరుతూ ఉత్తర్వులు జారీచేశారు. ఉయ్యూరుకు చెందిన సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస గౌడ్ ఈ ఏడాది జూన్ 22న రాష్ట్ర ఉపలోకాయుక్త కు సదరు విషయమై ఫిర్యాదు చేయగా లోకాయుక్త పై ఉత్తర్వులను జారీ చేశారు. పమిడిముక్కల మండలంలోని లబ్ధిదారులకు ఇచ్చేందుకు పమిడిముక్కల మండలంలోని గోడౌన్‌కు ఇనుము, సిమెంటును ఇవ్వగా ఆ లోడును కంకిపాడు గోడౌన్‌లో దించి 50 టన్నుల ఇనుము 1200 బస్తాల సిమెంటును గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది మాయం చేశారు. సదరు విషయము పై గృహ నిర్మాణ సంస్థ సిబ్బంది ఫిర్యాదు చేసినా ఆశాఖ డి.ఇ శివ ప్రసాద్, ఎ.ఇలపై ఎలాంటి విచారణ చేపట్టకపోవడంతో రాష్ట్ర గృహ నిర్మాణశాఖ మేనేజింగ్ డైరెక్టర్ శ్ హెప్సిబా రాణి కొర్లపాటి విచారణ చేపట్టేలా ఆదేశాలు ఇవ్వాలని కోరుతూ సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ లోకాయుక్త ను ఆశ్రయించడంతో జస్టిస్ పి.రజని పై ఉత్తర్వులు వెలువరించారు.అవనిగడ్డ నియోజకవర్గంలో సైతం గృహనిర్మాణ శాఖలో మెటీరియల్ మాయమైనట్లు ఆరోపణలు ఉన్నాయి.

# తిరువూరులో రాజకీయ పార్టీలతో ఆర్డీఓ సమావేశం !

- ఎన్నికల నియమావళి పాటించాలి..
- ఫ్లెక్సీలు, బ్యానర్లు తొలగించాలి



**తిరువూరు,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** తిరువూరు మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో తిరువూరు మున్సిపాలిటీ కార్యాలయంలో ఆర్డీఓ ఏ. కుమార్ ఆధ్వర్యంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, పట్టణంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్లను స్వచ్ఛందంగా తొలగించాలని సూచించారు. లేనిపక్షంలో మున్సిపల్ సిబ్బందితో తొలగిస్తామని స్పష్టం చేశారు. ఎన్నికలు ప్రశాంతంగా, పారదర్శకంగా జరిగేందుకు అన్ని పార్టీలు సహకరించాలని కోరారు .

# రాచర్ల జడ్పీటీసీ పదవిపై మొర్రి తిరుపతమ్మ ఆశలు!

- అవకాశం కల్పిస్తే పోటీకి సిద్ధం.. ఎమ్మెల్యే నిర్ణయం కోసం ఎదురుచూపులు



**రాచర్ల,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** మార్కాపురం జిల్లా రాచర్ల మండలంలోని యడవల్లి గ్రామానికి చెందిన మొర్రి తిరుపతమ్మ జడ్పీటీసీ పదవిపై ఆశలు పెట్టుకున్నారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన ఆమె, యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీని స్థాపించి అధ్యక్షురాలిగా పలు సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గిద్దలూరు నియోజకవర్గంలో యాదవ సామాజిక వర్గానికి గణనీయమైన జనాభా ఉన్న నేపథ్యంలో, గతంలోనూ మండల స్థాయి పదవికి పోటీ చేయాలని ఆమె ప్రయత్నించినట్లు తెలిపారు. ఈసారి రాచర్ల మండల జడ్పీటీసీ స్థానానికి పోటీ చేసే అవకాశం లభిస్తే ఎన్నికల బరిలో నిలిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. గ్రామస్థాయి నాయకుల సహకారం తనకు ఉందని పేర్కొంటూ, స్థానిక ఎమ్మెల్యే అవకాశం కల్పిస్తే పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని మొర్రి తిరుపతమ్మ ఆశాభావం వ్యక్తం చేశారు. జడ్పీటీసీ పదవికి అవకాశం లభిస్తుందా లేదా అన్నది రానున్న రాజకీయ పరిణామాలు, పార్టీ నిర్ణయాలపై ఆధారపడి ఉండనుంది.

# ఆశాజ్యోతి ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం

- దివ్యాంగ పిల్లల సంక్షేమానికి దాతల సహకారం

**హనుమాన్ జంక్షన్,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** ఆశ్రమంలోని దివ్యాంగ పిల్లలను ఆరోగ్యంగా, ఆనందంగా ఉంచేందుకు నిరంతరం కృషి చేస్తున్నామని ఆశాజ్యోతి హ్యాండీక్యాప్డ్ వెల్ఫేర్ సొసైటీ కార్యదర్శి మరీదు మాధవీలత తెలిపారు. గురువారం పుట్టగుంట హెల్త్ ఫౌండేషన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్, లయన్స్ క్లబ్ ఆఫ్ హనుమాన్ జంక్షన్ గ్లోబల్ సహకారంతో ఆశ్రమంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథి కాకర్ల శంకరరావు శిబిరాన్ని ప్రారంభించి, పిల్లలకు వైద్య సేవలు అందించిన వైద్య బృందాన్ని అభినందించారు. నేషనల్ స్పెషల్ ఒలింపిక్స్‌కు ఎంపికైన ఆశాజ్యోతి విద్యార్థులను అభినందించి, దసరా సందర్భంగా పిల్లలకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఆశాజ్యోతి సేవా కార్యక్రమాలకు తన వంతు సహకారంగా ప్రతి ఏడాది రూ.లక్ష విరాళం అందజేస్తానని శంకరరావు ప్రకటించారు. శిబిరంలో ఆశ్రమ హాస్పిటల్, అకిరా కంటి ఆసుపత్రి వైద్యులు పిల్లలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. కంటి సమస్యలు ఉన్నవారికి అవసరమైన కళ్లద్దాలు ఉచితంగా అందించాలని నిర్వాహకులు నిర్ణయించారు. వైద్య



బృందాన్ని శాలువాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆశాజ్యోతి చైర్మన్ మరీదు వెంకటస్వామి, కార్యదర్శి మాధవీలత, లయన్స్ క్లబ్ ప్రతినిధులు తాడి రంగారావు, మత్తి సాంబశివరావు, అక్కినేని రాఘవేంద్రరావు, చలసాని వెంకటేశ్వరరావు, అక్కినేని శ్రీనివాస ఫణీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధి చేయాలనే సంకల్పంతో జనసేన తీర్థం

-సీనియర్ నాయకులు వాసిరెడ్డి కృష్ణ



**రౌతులపూడి,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** రౌతులపూడి మండలం సీనియర్ నాయకులు వాసిరెడ్డి కృష్ణ కాకినాడ పార్లమెంటు సభ్యుడు తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ సమక్షంలో జనసేన పార్టీ కండువా వేసుకున్నారు. ఆయన మాట్లాడుతూ అభివృద్ధి చేయాలని సంకల్పంతో జనసేనలోకి వచ్చానని ప్రజలు అభిమానిస్తే వారి కోరిక మేరకు పనిచేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల జనసేన నాయకులు సలీం, గిరి, ప్రసాద్, సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

# కూటమి అభ్యర్థుల గెలుపునకు సమష్టిగా కృషి చేయాలి : కనపర్తి



**మోపిదేవి/అవనిగడ్డ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అవనిగడ్డ నియోజకవర్గంలో కూటమి అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని తెలుగుదేశం పార్టీ అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు సూచించారు. కూటమి అభ్యర్థులు నూరు శాతం విజయం సాధించేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. గురువారం మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో కనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ, కూటమి అభ్యర్థులను గెలిపించేందుకు తెలుగుదేశం పార్టీ శ్రేణులంతా ఐక్యంగా ముందుకు సాగాలని అన్నారు. గ్రామస్థాయిలో ప్రజలతో మమేకమవుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించాలని సూచించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తోందని కనపర్తి పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రభుత్వం పలు చర్యలు చేపడుతోందని తెలిపారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు స్థానిక సమస్యల పరిష్కారానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు.రానున్న స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పార్టీ శ్రేణులు క్షేత్రస్థాయిలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, కూటమి అభ్యర్థుల విజయానికి సమష్టిగా పనిచేయాలని కనపర్తి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో దివి మార్కెట్ కమిటీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు,మోపిదేవి మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు నడకుదిటి జనార్ధనరావు,మాజీ జెడ్పీటీసీ మెడబలిమి మల్లికార్జునరావు,పార్టీ నాయకులు రావి నాగేశ్వరరావు,చందన రంగారావు, దిడ్ల జానకి రాంబాబు,పుప్పాల ఏసు,కొమ్ము పవన్, కొక్కిలిగడ్డ శివుడు,గవిని శివరామ కృష్ణ,మాతంగి జనార్ధన్, నాగబాబు, పీతా కనకయ్య, కందుల బసవయ్య,యక్కటి అర్జునరావు,కంచర్ల శ్రీనివాసరావు, మోటుపల్లి జనార్ధన్,గొరిపర్తి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# అబ్దుల్ కలాంకు ఘన నివాళి: స్ఫూర్తి శిఖరమన్న చంద్రబాబు, ఆదర్శమన్న పవన్ కల్యాణ్




**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** భారతరత్న, మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతిని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశాభివృద్ధికి, సమాజానికి కలాం అందించిన అసమాన సేవలను వారు స్మరించుకున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలాంను "స్ఫూర్తి శిఖరం"గా అభివర్ణించారు. ఆయన ఒక అరుదైన వ్యక్తిత్వమని, భారత అణు, సాంకేతిక రంగాలకు సరికొత్త దిశానిర్దేశం చేసిన దార్శనికుడని కొనియాడారు. కలాం జయంతి సందర్భంగా ఆ మహనీయుడి సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని 'ఎక్స్' వేదికగా ఆయన పిలుపునిచ్చారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన సందేశంలో.. రామేశ్వరంలోని ఒక సామాన్య కుటుంబంలో జన్మించి, దేశం గర్వించే శాస్త్రవేత్తగా, "ప్రజా రాష్ట్రపతి"గా కలాం ఎదిగిన తీరును కొనియాడారు. ఎస్ఎల్‌వీ-3, అగ్ని, పృథ్వీ క్షిపణుల రూపకల్పన, పోఖ్రాన్-2 అణు పరీక్షలు, టెక్నాలజీ విజన్ 2020 వంటి కీలక ఘట్టాలలో ఆయన పోషించిన అద్వితీయ పాత్రను ఈ సందర్భంగా గుర్తుచేశారు. సామాన్య నేపథ్యం ఉన్నత లక్ష్యాల సాధనకు అడ్డంకి కాదని కలాం జీవితం నిరూపిస్తుందన్నారు. శాస్త్రీయ దృక్పథం, స్వయం సమృద్ధి, నిరంతర అభ్యాసం వంటి ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే మనం ఆయనకు ఇచ్చే నిజమైన గౌరవమని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు.

# కనులపండువగా దసరా ఉత్సవాలు...

**గుడ్లవల్లేరు,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా గురువారం కొనసాగాయి. సకల ఐశ్వర్యాలు, సుఖసంతోషాలు ప్రసాదించాలని కోరుకుంటూ అమ్మవారిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల సందడి నెలకొంది. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మహాక్షేత్రంలో ప్రతిరోజూ ఉత్సవమూర్తులకు అభిషేకాలు, అమ్మవారికి కుంకుమార్చనలు, వాహన సేవలు నిర్వహిస్తున్నారు. ప్రతిరోజు మహిళా భక్తులకు ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహిస్తున్నారు. ఆలయ నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ పర్యవేక్షణలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు. నవరాత్రుల సందర్భంగా ఆలయాన్ని సందర్శించే మహిళా భక్తులకు పసుపు, కుంకుమ, గాజులను ఆలయ వ్యవస్థాపక



ధర్మకర్త పురిటిపాటి వేంకట కష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతులు ప్రతిరోజూ అందిస్తున్నారు.

# కలాం ఆశయాలతో వికసిత భారత్ నిర్మాణానికి కృషి చేయాలి

-ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్



**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని విద్య, విజ్ఞానం, క్రమశిక్షణ, దేశభక్తి విలువలతో ముందుకు సాగుతూ వికసిత భారతదేశ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ పిలుపునిచ్చారు. రైట్ కంప్యూటర్స్, అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విజయవాడ భవానీపురంలోని హెచ్‌ఓ కన్వెన్షన్‌లో గురువారం డాక్టర్ అబ్దుల్ కలాం 95వ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన పీవీఎన్ మాధవ్ కలాం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి ఆయన అందించిన సేవలను, శాస్త్ర సాంకేతిక రంగంలో సాధించిన విజయాలను, యువతకు అందించిన స్ఫూర్తిదాయక సందేశాలను స్మరించుకున్నారు.

**యువతే దేశానికి గొప్ప సంపద..** ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర మైనారిటీ మోర్చా అధ్యక్షుడు సయ్యద్ బాషా మాట్లాడుతూ యువత దేశానికి గొప్ప సంపద అని కలాం భావించేవారని తెలిపారు. విద్యార్థులు పెద్ద కలలు కనాలని, వాటిని సాకారం చేసుకునేందుకు నిరంతరం శ్రమించాలని ఆయన ప్రోత్సహించారని పేర్కొన్నారు. విద్య, విజ్ఞానం, సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకుని యువత దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు.

# భక్తుల సేవలోనే అధికార యంత్రాంగం

**● మూలా నక్షత్రాన అమ్మ దర్శనానికి ఆటంకం లేకుండా పకడ్బందీ ఏర్పాట్లు ● మూడు లక్షల మంది వరకు భక్తులు వచ్చినా ఇబ్బంది లేదు ● సాయంత్ర 4-4.30 గంటల మధ్యలో ఇంద్రకీలాద్రికి గౌరవ ముఖ్యమంత్రి ● 450 సీసీ కెమెరాలతో నిరంతర పర్యవేక్షణ ● భక్తులకు మంచినీరు, మజ్జిగ, బిస్కెట్లు, అన్న ప్రసాదం పంపిణీ ● వర్షం కురిసినా అమ్మవారి దర్శనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ● కొండరాళ్లపై నిరంతర నిఘా.. ప్రత్యేక సాంకేతిక బృందం పర్యవేక్షణ ● జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, దేవాదాయ కమిషనర్ కె.రామచంద్రమోహన్**

**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** ఇంద్రకీలాద్రిపై మూలా నక్షత్రం సందర్భంగా మూడు లక్షల మంది వరకు భక్తులు వచ్చినా ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన ఏర్పాట్లు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. భక్తులకు సౌకర్యవంతంగా, సురక్షితంగా అమ్మవారి దర్శనం కల్పించడమే లక్ష్యంగా జిల్లా యంత్రాంగం, పోలీసు, దేవస్థానం అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తూ దర్శన ఏర్పాట్లు చేసినట్లు వివరించారు. మూలానక్షత్రం రోజున అనుసరించాల్సిన ప్రణాళికపై గురువారం కొండ దిగువ భాగాన ఇరిగేషన్ మోడల్ గెస్ట్ హౌజ్‌లోని కమాండ్ కంట్రోల్ కేంద్రంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, సీపీ ఎస్వీ రాజశేఖరబాబు, దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్, ఆలయ ఈవో వీకే శీనా నాయక్ తదితరులు సమావేశమయ్యారు. స్థానాచార్యులు విష్ణుభట్ల శివప్రసాదశర్మ సమక్షంలో చర్చించారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ భక్తుల రద్దీని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు 450 సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, అత్యాధునిక కమాండ్ కంట్రోల్ కేంద్రం ద్వారా పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నామని తెలిపారు. హోల్డింగ్ పాయింట్లతో పాటు క్యూలైన్లలో భక్తులకు మంచినీరు, మజ్జిగ, బిస్కెట్లు, అన్నప్రసాదం పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. మూలా నక్షత్రం రోజున వర్షం కురిసినా భక్తులకు ఇబ్బందులు కలగకుండా మహామండపం ద్వారా



దర్శనానికి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు సిద్ధం చేశామని పేర్కొన్నారు. కొండరాళ్ల పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించేందుకు ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేశామని, భక్తుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. భక్తులు హడావుడి పడకుండా సంయమనం పాటిస్తూ, అధికారుల సూచనలను అనుసరించి క్రమపద్ధతిలో అమ్మవారిని దర్శించుకోవాలని విజ్ఞప్తి చేశారు. సాయంత్రం 4 గంటల నుంచి 4.30 గంటల మధ్యలో గౌరవ ముఖ్యమంత్రి అమ్మవారికి



పట్టు వస్త్రాలు సమర్పిస్తారన్నారు. ఇందుకు తగిన ఏర్పాట్లు చేశామని వివరించారు. ముఖ్యమంత్రితో పాటు గౌరవ మంత్రులు, రాష్ట్రస్థాయి ఉన్నతాధికారుల సూచనలను పరిగణనలోకి తీసుకొని ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు మాట్లాడుతూ ప్రస్తుతం 3,500 మంది పోలీసు సిబ్బంది విధుల్లో ఉన్నారని.. మూలానక్షత్రం రోజును పురస్కరించుకొని అదనంగా 900 మందికి బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. ఎంత సమయంలో అమ్మవారి దర్శనం లభిస్తుందనే దాంతో పాటు వివిధ అంశాలకు సంబంధించి కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా గంట గంటకూ బులెటెన్ విడుదల చేయనున్నట్లు తెలిపారు. వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన డిజిటల్ స్క్రీన్ల ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించనున్నట్లు వెల్లడించారు. డేటా అనలిటిక్స్ ద్వారా ఎంత సమయంలో అమ్మవారి దర్శనమవుతుందో కచ్చితత్వంతో తెలియజేసేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. మూలా నక్షత్రం రోజున సామాన్య భక్తులకు పెద్దపీట వేయడం జరుగుతుందని.. వీఐపీ పాస్‌లను రద్దుచేసినట్లు తెలిపారు. ప్రజలు పోలీసులతో పాటు అధికార యంత్రాంగం చేసే సూచనలు పాటించి సహకరించాలని కోరారు. దేవాదాయ శాఖ కమిషనర్ కె.రామచంద్రమోహన్ మాట్లాడుతూ గతేడాదితో పోల్చితే ఈసారి ప్రతిరోజూ అమ్మవారిని దర్శించుకునే భక్తుల సంఖ్య పెరుగుతోందని తెలిపారు. ఈసారి మూలానక్షత్రం రోజున 2,50,000 నుంచి మూడు లక్షల మంది వరకు భక్తులు వచ్చే అవకాశముందన్నారు. ఎప్పుడు ఎక్కడ ఎవరికి ఏ సమస్య వచ్చినా వెంటనే స్పందించి పరిష్కరించేందుకు అత్యాధునిక సాంకేతికత సహాయంతో చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్ ఫీడ్ బ్యాక్ విధానం ద్వారా మంచి ఫలితాలు వస్తున్నాయన్నారు. వైదిక కమిటీ సభ్యులతోనూ చర్చించి భక్తులకు సంతృప్తికర అమ్మవారి దర్శనం లభించేలా ఏర్పాట్లు చేసినట్లు రామచంద్రమోహన్ పేర్కొన్నారు.

## భక్తుల సేవలో.. కలెక్టర్ నిరంతర పర్యవేక్షణ..

### – కమాండ్ కంట్రోల్ కేంద్రంతో పాటు క్షేత్రస్థాయిలో సుడిగాలి తనిఖీలు





**విజయవాడ, అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** దసరా ఉత్సవాల్లో 5వరోజు –జగన్మాత శ్రీ లలితా త్రిపుర సుందరీ దేవిగా దర్శనమిస్తుండగా ఇంద్రకీలాద్రిపై భక్తుల రద్దీ కొనసాగుతుంది. అన్ని క్యూ లైన్లలో భక్తులు తరలివెళ్తూ అమ్మ దర్శనం చేసుకుంటున్నారు. మరోవైపు రాష్ట్రం నలుమూలల నుంచే కాకుండా వివిధ రాష్ట్రాల నుంచి వస్తున్న భక్తులకు ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో క్యూలైన్లను పరిశీలిస్తుండటంతో పాటు కొండ దిగువున గల సమీకృత కమాండ్ కంట్రోల్ కేంద్రం (ఐసీసీసీ) నుంచి పరిస్థితులను తెలుసుకుంటున్నారు. సమన్వయ శాఖల అధికారులకు దిశానిర్దేశం చేస్తున్నారు. రద్దీ నియంత్రణ, వీవీఐపీ, వీఐపీ వాహనాల రాకపోకలు, క్రౌడ్ మేనేజ్‌మెంట్, శాంతిభద్రతల పరిరక్షణ.. ఇలా ప్రతి విషయంలోనూ సీసీసీ ఉత్సవాల నిర్వహణలో కీలకంగా నిలుస్తోంది. నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటుచేసిన సీసీటీవీలు, డ్రోన్ల విజువల్స్‌ను నిరంతరం పరిశీలిస్తూ ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉత్సవాల విజయవంతానికి సీసీసీ సిబ్బంది కృషిచేస్తున్నారు. ఆధునిక కెమెరాల డేటాను కూడా ఎప్పటికప్పుడు విశ్లేషిస్తూ వాహనాల ఎంట్రీ, ఎగ్జిట్‌ను నిశితంగా పరిశీలిస్తూ ఘాట్ రోడ్డుపై ట్రాఫిక్ జామ్ కాకుండా, నిబంధనల ఉల్లంఘనల జరక్కుండా చూస్తున్నారు.

## ఉపాధి కేంద్రాలుగా గ్రామాలు

### విజయవాడలో సరస్ మేళాను ప్రారంభించిన రాష్ట్రపతి ముర్ము, సీఎం చంద్రబాబు

(మొదటిపేజీ తరువాయి)

ఎదుగుతున్నాయని.. భవిష్యత్తులో అంతర్జాతీయ బ్రాండ్లుగా మారాలని సీఎం ఆకాంక్షించారు. మహిళలు ఉద్యోగాలు కోరుకునే స్థాయి నుంచి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని పిలుపునిచ్చారు. గ్రామీణ మహిళలు తయారు చేసే ఉత్పత్తులను ఈ–కామర్స్, ఆన్‌లైన్ షాపింగ్ వేదికల ద్వారా స్వయం ఏపీ పేరుతో మార్కెటింగ్ చేస్తామని తెలిపారు. వాట్సప్, ఇన్‌స్టాగ్రామ్ వంటి సామాజిక మాధ్యమాలను వ్యాపార అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. గ్రామీణ మార్కెట్ల నుంచి ప్రపంచ మార్కెట్ల వరకు మహిళల ఉత్పత్తులు చేరేలా సరఫరా వ్యవస్థను బలోపేతం చేయాలని చెప్పారు. మహిళల సామర్థ్యాన్ని పూర్తి స్థాయిలో వినియోగించు కున్నప్పుడే వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోగలమని స్పష్టం చేశారు. మహిళలను గౌరవించడం, వారి ఆలోచనలకు విలువ ఇవ్వడం, కలలను సాకారం చేసుకునేందుకు అవసరమైన అవకాశాలు, సహకారం అందించడం సమాజ బాధ్యత అని అన్నారు.

**ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలి..** సంక్షేమ పథకాలతో మహిళలకు భరోసా కల్పిస్తూనే, ఆర్థిక స్వావలంబన సాధించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని చంద్రబాబు తెలిపారు. తల్లికి వందనం పథకంతో పిల్లల చదువుకు అండగా నిలుస్తున్నామని, దీపం పథకంతో మహిళల ఖర్చులను తగ్గిస్తున్నామని చెప్పారు. స్త్రీశక్తి ఉచిత బస్సు ప్రయాణ పథకం ద్వారా మహిళలు ఇప్పటివరకు 100 కోట్ల ప్రయాణాలు చేశారని వెల్లడించారు. మహిళల పేరుతో ఇళ్ల పట్టాలు సహా పలు ప్రయోజనాలు అందిస్తున్నామని తెలిపారు. సంక్షేమం నుంచి అభివృద్ధి, ఆర్థిక స్వావలంబన దిశగా మహిళలను ముందుకు తీసుకెళ్లడమే ప్రభుత్వ విధానమని వివరించారు. ప్రతి స్వయం సహాయక సంఘం ఒక చిన్న ఆర్థిక శక్తిగా, ప్రతి మహిళ ఒక పారిశ్రామికవేత్తగా, ప్రతి గ్రామం ఉపాధి కేంద్రంగా ఎదగాలని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. మహిళల భద్రత, ఆత్మగౌరవం, సాధికారతకు ప్రాధాన్యమిస్తూ స్వర్ణాంధ్ర లక్ష్యాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు. ఇంట్లోని ప్రతి మహిళను ప్రోత్సహించాలని, వారి కలలు నిజం చేసుకునేందుకు కుటుంబ సభ్యులు అండగా నిలవాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్రగవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, కేంద్ర మంత్రులు శివరాజ్ సింగ్ చౌహాన్, పెమ్మసాని చంద్రశేఖర్, రామ్మోహన్ నాయుడు, మంత్రులు కొండపల్లి శ్రీనివాస్, అనిత తదితరులు హాజరయ్యారు.

## దసరా ఉత్సవాల్లో వైద్య సేవలకు విస్తృత ఏర్పాట్లు

### –దుర్గమ్మ ఉత్సవాలకు వచ్చే భక్తుల సౌకర్యార్థం

**విజయవాడ,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** దసరా ఉత్సవాలకు వచ్చే భక్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు విజయవాడ దుర్గామల్లేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో వైద్యారోగ్యశాఖ విస్తృత ఏర్పాట్లు చేసింది. ఈ ఏడాది 16 వైద్య శిబిరాలను ఏర్పాటు చేసి, 49 మంది వైద్యాధికారులు, 30 మంది ప్రత్యేక వైద్యులు, 431 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించింది. అత్యవసర సేవల కోసం 9 అంబులెన్సులను అందుబాటులో ఉంచింది. వైద్య సేవల పర్యవేక్షణ కోసం 19 సెక్టార్లను ఏర్పాటు చేసి, ఆరుగురు కార్యక్రమ అధికారులను నియమించింది. కార్యక్రమ సమన్వయ అధికారి పోస్టును కూడా కొత్తగా ఏర్పాటు చేసింది. అక్టోబరు 21 వం–కు దసరా ఉత్సవాల వైద్య సేవలు కొనసాగుతాయి. ఈ వివరాలను ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కె.వి.ఎన్. చక్రధర్‌బాబు ఒక ప్రకటనలో వెల్లడించారు.



**పెరిగిన వైద్య సేవలు..** దసరా ఉత్సవాల మొదటి నాలుగు రోజుల్లో ఈ ఏడాది 31,228 మంది వైద్య సేవలు పొందారు. ఎన్టీఆర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ. శ్రవణబాబు, సీనియర్ అధికారి డాక్టర్ జె. ఇందుమతి దేవీరావు క్షేత్రస్థాయిలో భక్తులకు అందుతున్న వైద్య సేవలను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

**సరస్ మేళాలోనూ ప్రత్యేక వైద్య సేవలు..** సరస్ మేళా సందర్భంగా అక్టోబరు 31 వరకు ప్రత్యేక వైద్య ఏర్పాట్లు చేశారు. మొత్తం నాలుగు వైద్య శిబిరాల ద్వారా సేవలు అందిస్తున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం ఐదు పడకల చికిత్స కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ప్రథమ రిఫరల్ వైద్యశాలగా భవానీపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని గుర్తించారు. విజయవాడ ఉత్సవాల కోసం ప్రత్యేక వైద్య శిబిరాన్ని, ఉన్నత స్థాయి వైద్య సేవల కోసం విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో ప్రత్యేక రిఫరల్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాల కోసం 15 మంది వైద్యాధికారులు, ఐదుగురు ప్రత్యేక వైద్యులు, 85 మంది పారామెడికల్ సిబ్బందిని నియమించారు. అత్యవసర సేవల కోసం 108 అంబులెన్సులను నాలుగు ప్రాంతాల్లో సిద్ధంగా ఉంచినట్లు ప్రజారోగ్య సంచాలకులు డాక్టర్ ఆర్. వెంకటరమణ తెలిపారు.

## జిల్లాలో గ్రామ పంచాయతీల రిజర్వేషన్లు ఖరారు

**ఏలూరు,అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** జిల్లాలోని 542 గ్రామ పంచాయతీలకు సంబంధించి 542 సర్పంచ్ లు , 5676 గ్రామ వార్డ్ మెంబెర్స్ పదవులకు సంబంధించి రిజర్వేషన్లు ఖరారు చేసినట్లు జిల్లా కలెక్టర్ కె. వెట్రిసెల్వి తెలియజేసారు.



**గ్రామ పంచాయతీ సర్పంచ్ లకు రిజర్వేషన్లు..** జిల్లాలోని 542 గ్రామ పంచాయతీలకు సంబంధించి మహిళలకు 266 స్థానాలు, జనరల్ కు 276 స్థానాలు కేటాయించారు. వాటిలో షెడ్యూల్డ్ ఏరియాలోని 63 స్థానాలకుగాను మహిళలకు 31 స్థానాలు , జనరల్ కు 32 స్థానాలు , 100 శాతం షెడ్యూల్డ్ తెగల తండాలు కలిగిన 2 ఎస్టీ పంచాయతీలలో ఒకటి మహిళలకు, ఒకటి జనరల్ కు కేటాయించినట్లు చెప్పారు. అదేవిధంగా నాన్ –షెడ్యూల్డ్ ప్రాంతాలలోని 479 స్థానాలకు సంబంధించి షెడ్యూల్డ్ తెగలకు 6 స్థానాలకు గాను 2 మహిళలకు, 4 జనరల్ కు, షెడ్యూల్డ్ కులాలలకు 121 స్థానాలకు గాను 56 మహిళలకు, 65 జనరల్ కు, వెనుకబడిన తరగతులకు 104 స్థానాలకు గాను 52 మహిళలకు, 52 జనరల్ కు, రిజర్వు కాని కేటగిరీకి 246 స్థానాలకు గాను 124 మహిళలకు, 122 జనరల్ కు కేటాయించినట్లు చెప్పారు.

**వార్డ్ మెంబెర్స్ స్థానాలకు రిజర్వేషన్లు..** జిల్లాలోని 5676 వార్డ్ మెంబర్ల స్థానాలకు సంబంధించి షెడ్యూల్డ్ ఏరియాలోని 63 గ్రామ పంచాయతీలలోని 626 వార్డ్ మెంబర్ల స్థానాలకుగాను మహిళలకు 313 స్థానాలు , జనరల్ కు 313 స్థానాలు కేటాయించారు. షెడ్యూల్డ్ కులాలకు 403 స్థానాలకు గాను 187 స్థానాలు మహిళలకు, 216 స్థానాలు జనరల్ కు కేటాయించారు. రిజర్వు కాని కేటగిరీకి సంబంధించి 223 స్థానాలకు గాను 126 మహిళలకు, 97 జనరల్ కు కేటాయించినట్లు చెప్పారు. నాన్ షెడ్యూల్డ్ ఏరియాలోని 479 గ్రామ పంచాయతీలలోని 5050 వార్డ్ మెంబర్ల స్థానాలకుగాను మహిళలకు 2525 స్థానాలు , జనరల్ కు 2525 స్థానాలు కేటాయించారు. షెడ్యూల్డ్ తెగలకు 92 స్థానాలకు గాను 37 మహిళలలకు, 55 జనరల్ కు కేటాయించారు. షెడ్యూల్డ్ కులాలకు 1289 స్థానాలకు గాను 560 స్థానాలు మహిళలకు, 729 స్థానాలు జనరల్ కు కేటాయించారు. వెనుకబడిన తరగతులకు సంబంధించి 1099 స్థానాలకు గాను 521 మహిళలకు , 574 జనరల్ కు కేటాయించారు. రిజర్వు కాని కేటగిరీకి సంబంధించి 2570 స్థానాలకు గాను 1407 మహిళలకు, 1163 స్థానాలు జనరల్ కు కేటాయించినట్లు కలెక్టర్ తెలియజేసారు.

## డాక్టర్ అబ్దుల్ కలాం కు ఘన నివాళులు తెలియజేసిన బిసి నేత "భేరి"

**హైదరాబాద్, అక్టోబర్ 15 (వార్తాప్రభ) :** శేరిలింగం పల్లి, గుల్మోహార్ పార్క్ లో డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం జయంతి సందర్భంగా బీసీ ఐక్యవేదిక తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు రామచంద్ర యాదవ్ ఘన నివాళులు అర్పించారు. భారత రాష్ట్రపతి పదవికి ముందు, రక్షణ పరిశోధన అభివృద్ధి సంస్థ, భారతీయ అంతరిక్ష పరిశోధన సంస్థ లో ఏరోస్పేస్ ఇంజనీర్ గా పనిచేశాడు. భారతదేశపు మిస్సైల్ మ్యాన్ గా పేరుగాంచాడు. కలామ్ ముఖ్యంగా బాలిస్టిక్ క్షిపణి, ప్రయోగ వాహన సాంకేతికత అభివృద్ధికి కృషిచేశాడు. 1998లో భారతదేశ పోఖ్రాన్–II అణు పరీక్షలలో కీలకమైన, సంస్థాగత, సాంకేతిక, రాజకీయ పాత్ర పోషించాడు. 2002 రాష్ట్రపతి ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ అతన్ని అభ్యర్థిగా ప్రతిపాదించగా, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ మద్దతు తెలిపింది. ఆ ఎన్నికలలో వామపక్షాలు బలపరిచిన లక్ష్మీ సెహగల్ పై గెలిచాడు. కలామ్ తన పుస్తకం ఇండియా 2020 లో 2020 నాటికి భారతదేశాన్ని ఒక అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి అభివృద్ధి ప్రణాళికలు సూచించాడు. భారతదేశపు అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్నతో సహా అనేక ప్రతిష్ఠాత్మక అవార్డులను అందుకున్నారని "భేరి" అన్నారు. దేశానికి ఎనలేని సేవ చేసి నేటి తరానికి రేపటి తరానికి ఆదర్శంగా నిలిచిన వ్యక్తి అని అన్నారు.




## తెలంగాణలో పెట్టుబడులు పెట్టండి

### సమాఖ్య గ్లోబల్ బిజినెస్ మీట్--2026లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క

(మొదటిపేజీ తరువాయి)

పెరి అర్బన్ రీజియన్ (ప్యూర్), రూరల్ అగ్రికల్చర్ రీజియన్ (రేర్) విధానాల ద్వారా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. కోర్ అర్బన్ ప్రాంతంలో ఐటీ, మౌలిక సదుపాయాలు, సేవారంగానికి ప్రాధాన్యమిస్తామని చెప్పారు. పెరి అర్బన్ ప్రాంతంలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా ప్రత్యేక క్లస్టర్లను అభివృద్ధి చేస్తామని వెల్లడించారు. ఔటర్ రింగ్ రోడ్డు, భవిష్యత్తులో నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్డు మధ్య ప్రాంతాన్ని అనుసంధానిస్తూ రేడియల్ రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టామని తెలిపారు. ఇప్పటికే 21 రేడియల్ రోడ్లకు సంబంధించి మంజూరు, రూపకల్పన ప్రక్రియ చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ రహదారుల అనుసంధానంతో ఫార్మా, బయోటెక్నాలజీ, విద్య, సాఫ్ట్‌వేర్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి రంగాలకు ప్రత్యేక పారిశ్రామిక క్లస్టర్లను అభివృద్ధి చేసే అవకాశం ఏర్పడుతుందని వివరించారు. రూరల్ అగ్రికల్చర్ రీజియన్‌లో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలను పెద్దఎత్తున ప్రోత్సహించేందుకు అవసరమైన వ్యవస్థను అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక వనరులకు విలువ జోడించే పరిశ్రమలు ఏర్పాటు కావడం ద్వారా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ప్రాంతీయ ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతుందని పేర్కొన్నారు.



**సంపద సృష్టిలో పారిశ్రామికవేత్తలదే కీలక పాత్ర..** మారుతున్న ఆర్థిక పరిస్థితుల్లో సంపద సృష్టికి వ్యవసాయంతోపాటు పరిశ్రమలు, సేవారంగం కీలకంగా మారాయని ఉప ముఖ్యమంత్రి అన్నారు. తెలంగాణ స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ)లో వ్యవసాయ రంగం వాటా సుమారు 16 శాతం ఉండగా, పరిశ్రమలు, సేవారంగం కలిపి ఆర్థిక వ్యవస్థకు ప్రధానంగా దోహదపడుతున్నాయని వివరించారు. సేవారంగం వాటా సుమారు 65 శాతంగా ఉందని, పారిశ్రామిక రంగం కూడా ఆర్థిక వృద్ధిలో కీలక పాత్ర పోషిస్తోందని చెప్పారు. ఫార్మా, కోర్ ఇండస్ట్రీలు, ఆక్వా, ఎగుమతులు, దిగుమతులు, ఐటీ, పారిశ్రామిక మౌలిక సదుపాయాలు వంటి విభిన్న రంగాల్లో ఉన్న వ్యాపారవేత్తలు రాష్ట్ర ఆర్థిక ప్రగతికి మరింతగా తోడ్పడాలని పిలుపునిచ్చారు. సంపద సృష్టించేవారికి ప్రతి రాష్ట్రం, ప్రతి సమాజం అండగా నిలవాల్సిన అవసరం ఉందన్నారు. పారిశ్రామికవేత్తలు ఎదగడంతోపాటు రాష్ట్రానికి ఉపాధి, పెట్టుబడులు, ఆదాయం పెరగడానికి దోహదపడాలని ఆకాంక్షించారు.

**పరిశ్రమలకు ప్రభుత్వం అండగా ఉంటుంది..** సమాఖ్య చాంబర్ ఆఫ్ కామర్స్‌కు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని భట్టి విక్రమార్క హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు సహా రాష్ట్ర మంత్రివర్గం మొత్తం పెట్టుబడిదారులకు అవసరమైన సహకారం అందించేందుకు సిద్ధంగా ఉందన్నారు. పరిశ్రమల స్థాపనలో ఎదురయ్యే సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తామని తెలిపారు. పెట్టుబడులకు అవసరమైన అనుమతులు, భూమి, విద్యుత్, నీరు వంటి సదుపాయాల కల్పనలో ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. రాజకీయాలు, వ్యాపారం, సినీ పరిశ్రమ, వ్యవసాయం, ఐటీ, ఏరోస్పేస్, రక్షణ రంగం తదితర అన్ని రంగాల్లో అభివృద్ధికి ప్రభుత్వం తోడ్పడుతుందని చెప్పారు.

**అందరినీ కలుపుకొని అభివృద్ధి సాధించాలి..** సంపద కొద్దిమంది చేతుల్లోనే కేంద్రీకృతం కాకుండా, అభివృద్ధి ఫలాలు సమాజంలోని అన్ని వర్గాలకు అందాలని ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. పారిశ్రామికవేత్తలు తమ అనుభవం, పరిజ్ఞానాన్ని ఇతర వర్గాలతో పంచుకోవాలని, కొత్తగా వ్యాపారాలు ప్రారంభించాలనుకునే వారికి మార్గదర్శకత్వం అందించాలని సూచించారు. సమాఖ్య వంటి సంస్థల ద్వారా ఈ తరహా కార్యక్రమాలకు వేదికలు కల్పించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఒక వర్గం మాత్రమే అభివృద్ధి చెందడం సంపూర్ణ ప్రగతి కాదని, తమతోపాటు మరో పదిమందిని ముందుకు తీసుకెళ్లినప్పుడే సమాజం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. పెట్టుబడిదారులు రాష్ట్ర అభివృద్ధిలో భాగస్వాములు కావాలని, ప్రభుత్వం కూడా వారితో కలిసి పనిచేస్తుందని భరోసా ఇచ్చారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చిన పారిశ్రామికవేత్తలకు స్వాగతం పలికిన భట్టి విక్రమార్క, వ్యాపారాలు విస్తరించుకుంటూ రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి, ఉపాధి కల్పనకు సహకరించాలని కోరారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188